VISALA ANDHRA VIJAYAWADA Phone No. 576

4 పేజీలు 6 నయాపైసలు రిజిస్టర్డునెం A 193

విశాలాంధ్ర

సంపుటి 7 * విజయవాడ బుధవారం ఆషాఢం 4-1880 [జూన్ 25-1958] * సంచికి 95

విశాఖపట్నంలో బ్రహ్మాండమైన ఊరేగింపు

విశాఖపట్నం, జూన్ 24

సమ్మెచేస్తున్న రేవు కార్మికుల పోరాటానికి అండదండలు ప్రకటిస్తూ విశాఖపట్నంలో నిన్న కార్మికులు బ్రహ్మాండమైన ప్రదర్శన జరిపారు. ఈ ఊరేగింపు ఒకపోటును గడిచిపోవటానికి 45 నిమిషాలు పట్టింది. తర్వాత పదివేలమందితో బహిరంగ సభ జరిగింది. (వి. వి.)

దక్షిణకోస్తా స్థానికసంస్థల నియోజక వర్గం ఫలితాలు

గుంటూరు, జూన్ 24

దక్షిణకోస్తా స్థానికసంస్థల నియోజకవర్గం నుంచి ఈ క్రింది అనుసరు అభ్యర్థులు గెలుపొందారు: శ్రీ కొల్లా వెంకయ్య (194) శ్రీకృష్ణారెడ్డి (202), రాఘవరెడ్డి (175), బొజ్జా ఆదినారాయణ (155) శ్రీమతి సూర్యవతి (156), వెనిశెట్టి సత్యనారాయణ (156). (వి. వి.)

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు 4 గురు కమ్యూనిస్టుల ఎన్నిక

ఇంతవరకు ప్రకటించిన స్థానిక సంస్థల నియోజకవర్గ ఫలితాల వివరాలు

ఉస్మానియా యూనివర్సిటీకి ప్రోఛాన్సలర్ పదవి రద్దు

వైస్ ఛాన్సలర్ నామినేషన్ పద్ధతికి తిరుపతి యూనివర్సిటీ ప్రాతికూల్యం

హైద్రాబాద్, జూన్ 24

ఆంధ్రప్రభుత్వం తయారుచేసిన ఉస్మానియా యూనివర్సిటీ బిల్లులో ప్రోఛాన్సలర్ పదవికి సంబంధించిన అంశాలను తొలగించాలని ఈ వేళ ఆంధ్ర మంత్రివర్గ సమావేశంలో నిశ్చయించినట్లు తెలుస్తోంది.

ముఖ్యమంత్రిగారు యూనివర్సిటీ ప్రోఛాన్సలర్‌గా వుండటానికి ఉస్మానియా యూనివర్సిటీ సెనేట్ ప్రాతికూల్యం ప్రకటిస్తున్నందున, తాను ఆ పదవిని స్వీకరించబోనని ముఖ్యమంత్రి సంజీవరెడ్డిగారు మంత్రివర్గ సమావేశంలో చెప్పారట.

ఆంధ్రలోని మిగతా యూనివర్సిటీలకు ప్రోఛాన్సలర్లు వుండగా ఉస్మానియా యూనివర్సిటీకి లేకపోవటం బాగుండదని కొందరు మంత్రులు పేర్కొనదలచినట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణాకు చెందిన మంత్రి ఒకరు సెనేట్ వ్యతిరేకిస్తున్న ప్రకారం ప్రోఛాన్సలర్ పదవిని సృష్టించటం మంచిదిగాదని చెప్పారనీ, దానిపై ఆ పదవికి సంబంధించిన అంశమును బిల్లునుంచి తొలగించాలని మంత్రివర్గం నిర్ణయించినదనీ వినవస్తోంది.

వైస్‌ఛాన్సలర్‌ను నామినేట్ చేసే పద్ధతిని ప్రవేశపెట్టకూడదని వెంకటేశ్వర యూనివర్సిటీగూడా తన అభ్యంతరం తెలిపినదని విశ్వసనీయ వర్గాలవారు అంటున్నారు. ప్రస్తుతమున్న పద్ధతికే - వైస్ ఛాన్సలర్‌ను సెనేట్ ఎన్నుకొనే పద్ధతికే - ఇకముందుకూడ కొనసాగించాలని ఆ యూనివర్సిటీ కోరుతున్నదట. అయితే ఈ ఆక్షేపణను త్రోసిపుచ్చి, నామినేషన్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ఆంధ్ర మంత్రివర్గం నిశ్చయించినట్లు తెలుస్తోంది. ఇందుకు అనుకూలంగా వెంకటేశ్వర యూనివర్సిటీ చట్టాన్ని సవరిస్తూ త్వరలో ఒకబిల్లు ప్రవేశపెట్టబోతున్నారు.

ఛాన్సలర్ నామినేట్ చేసిన వ్యక్తి ఒకరు, యూనివర్సిటీకి సంబంధంలేని విద్యావేత్తలు ఇద్దరుతో కూడిన సంఘం కనీసం ముగ్గురు పేర్లను వైస్‌ఛాన్సలర్ పదవికి సూచిస్తే, ఆ ముగ్గురిలో నుంచి ఒకరిని వైస్‌ఛాన్సలర్ పదవికి నామినేట్ చేస్తారు. (వి. వి.)

రజాకార్ నాయకుని హెబియస్ కార్పస్ దరఖాస్తు

హైద్రాబాదు, జూన్ 28

హైద్రాబాదు రజాకార్ నాయకుడు శ్రీ అలైసీ పెట్టుకొన్న హెబియస్ కార్పస్ దరఖాస్తును ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డివిజనల్ బెంచి నేడు అడ్మిట్ చేసుకొన్నది.

డిటెన్షన్‌చట్టం క్రింద తనను నిర్బంధంలో వుంచటం అక్రమమని ఆ దరఖాస్తులో ఆయన పేర్కొన్నారు.

1958 ఏప్రిల్ 14 వ తేదీన శ్రీ అలైసీని, ఆయనతోపాటు మరో ముగ్గురు రజాకార్ నాయకులను పోలీసులు అరెస్టుచేసి, డిటెన్షన్‌లో వుంచినసంగతి పాఠకులకు విదితమే.

అయితే అటుతర్వాత వారిలో ఇద్దరిని విడుదలచేశారు.

మాస్కోలో పశ్చిమ జర్మనీ రాయబార కార్యాలయం ముందు ప్రదర్శన

మాస్కో, జూన్ 23

పశ్చిమ జర్మనీ రాజధాని బాన్‌లోని సోవియట్ రాయబార కార్యాలయంఎదుట జరిపిన అసమ్మతి ప్రదర్శనలకు నిరసన సూచకంగా మాస్కోలోని పశ్చిమ జర్మనీ రాయబార కార్యాలయం ఎదుట అనేక వందల మంది యువకులు నేడు ప్రదర్శనలు జరిపారు.

"ఫాసిజం నశించాలి" అంటూ ప్రదర్శకులు నినాదాలిచ్చారు "జర్మన్ ఫాసిస్టులారా! మరొక అయిదేళ్ళలో మీగతి ఏమిటో మాకు తెలుసు; మీరు చూసుకోండి" "స్టాలిన్‌గ్రాడ్ వద్ద మేము మీకు నేర్పిన గుణపాఠం మరచిపోకండి" "నాంకరీ ప్రభుత్వం వర్ధిల్లాలి" అంటూ కూడా వారు నినాదాలిచ్చారు.

ఈ అసమ్మతి ప్రదర్శనలకు తాను స్వయంగా సోవియట్ విదేశాంగ మంత్రికి అధిక్షేపణ తెలుపబోతున్నానని పశ్చిమజర్మనీ రాయబారిపత్రికా విలేఖరులతో చెప్పారు.

బాన్‌లో జరిగిన ప్రదర్శనలకు పశ్చిమ జర్మనీ ప్రభుత్వం తన విచారాన్ని సోవియట్ ప్రభుత్వానికి తెలిపిందని కూడా ఆయన అన్నారు.

ప్రదర్శకులు కోపావేశంతో రాళ్ళు విసరిన ఫలితంగా పశ్చిమ జర్మనీ రాయబార కార్యాలయం కిటికీ తలుపులన్నీ బద్దలైపోయాయి.

లెబనాన్‌లో అంతర్యుద్ధ పరిస్థితి

పలుచోట్ల విప్లవకారులు గెలుపొందుతున్నట్లువార్త

బీరుట్, జూన్ 23

బీరుట్ మున్సిపల్ మార్కెట్టులో ఈవేళ ఒక బాంబు ప్రేలిన ఫలితంగా నలుగురు మరణించారు; మరొక 20 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగావుంది.

లెబనాన్‌లోని అనేక ప్రాంతాలలో విప్లవ కారులు విజయ పరంపరలు సాధిస్తున్నారని బీరుట్‌కు వస్తున్న వార్తలు తెల్పుతున్నాయి.

బీరుట్‌కు దక్షిణంగా 20 మైళ్ళ దూరంలో కోస్తా పట్టణమైన సిడోన్‌లో ప్రభుత్వ బలాలకు విప్లవకారులకు మధ్య నిన్నటి నుంచి భీకర యుద్ధం కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.

కామిలీచామూన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా "పవిత్ర యుద్ధం" సాగించవలసిందని ఉద్బోధిస్తూ బీరుట్‌లో ముస్లిం మతాధిపతులు పెద్దఎత్తున ప్రచారం సాగిస్తున్నారు.

శ్రీ ఈశ్వరరెడ్డి, సంకు అప్పారావు, కొల్లా వెంకయ్య, శ్రీమతి సూర్యావతిగార్ల గెలుపు

హైద్రాబాద్, జూన్ 23

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు స్థానిక సంస్థల నియోజకవర్గాలనుంచి కమ్యూనిస్టు అభ్యర్థులు శ్రీ సంకు అప్పారావు, శ్రీ వై. ఈశ్వరరెడ్డిగార్లు ఎన్నికయ్యారు.

కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలు నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ కొల్లా వెంకయ్యగారు మొదటి లెక్కింపులో ఎన్నికైనట్లు ప్రకటించారు.

దక్షిణ కోస్తా నియోజకవర్గంనుంచి శ్రీమతి మానికొండ సూర్యావతిగారు రెండవ లెక్కింపులో ఎన్నికైనట్లు ప్రకటించారని తాజావార్త.

ఇంతవరకు ప్రకటించబడిన ఫలితాల వివరాలు ఇవి:

దక్షిణ కోస్తా జిల్లా నియోజకవర్గంనుంచి శ్రీ కృష్ణారెడ్డిగారుకూడా ఎన్నికయ్యారు.

శ్రీ కృష్ణారెడ్డిగారికి 202 మొదటి వోట్లు, శ్రీ కొల్లా వెంకయ్యగారికి 194 మొదటి వోట్లు వచ్చినట్లు తెలుస్తోంది.

[ఇంకా ఈ నియోజకవర్గంలో మరొక నాలుగు స్థానాలకు ఫలితాలు ప్రకటించాలి. రెండవ లెక్కింపు సాగుతోంది]

రాయలసీమ స్థానికసంస్థల నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ వై. ఈశ్వరరెడ్డిగారు, ఉభయ గోదావరుల స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ సంకు అప్పారావుగారు ఆంధ్రప్రదేశ్ ఎగువసభకు ఎన్నికయ్యారు.

రాయలసీమ స్థానికసంస్థల నియోజకవర్గంలోని మిగతా అయిదుస్థానాలు కాంగ్రెసు అభ్యర్థులకు దక్కాయి. గెలుపొందిన అభ్యర్థుల పేర్లు ఇవి:

వై. ఈశ్వరరెడ్డి, కె. ఆదికేశవులు నాయుడు, దప్పిల పాండురంగారెడ్డి, డి. నారాయణరెడ్డి, ఆర్. వెంకటసుబ్బారెడ్డి, కె. మరీఫుద్దీన్.

ఈ నియోజకవర్గంలో మొత్తం 14 మంది అభ్యర్థులు పోటీచేశారు.

ఉభయగోదావరుల స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎగువసభకు కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ సంకు అప్పారావుగారితోపాటు ముగ్గురు కాంగ్రెసు అభ్యర్థులు విజయం పొందారు.

శ్రీమతిమానికొండ సూర్యావతి



కొల్లా వెంకయ్య,

వై. ఈశ్వరరెడ్డి,



సంకు అప్పారావు.

బొంబాయివద్ద రైలు ప్రమాదం

ఒకరి మరణం, 30 మందికి గాయాలు

బొంబాయి, జూన్ 24

సెంట్రల్ రైల్వేలో బొంబాయికి 25 మైళ్ళ దూరంలో రెండురైళ్ళు ఢీకొనడంవలన ఒకరు మరణించారు. మరొక 30 మందికి పైగా గాయపడ్డారు.

ఈ దుస్సంఘటన ఈవేళ ఉదయం ముంబ్రా-డివలమధ్య జరిగింది. స్టేషన్‌లో నిల్వవున్న ఒక రైలును మరొకరైలువచ్చి ఢీకొన్నది.

మరణించినది ఇంజన్ డ్రైవరేనని తరువాత తెలిసింది.

రెండు రైలుపెట్టెలు ఈ దుస్సంఘటనలో సర్వనాశన మయ్యాయి.

డెన్మార్కు రాయబార కార్యాలయం ఎదుట ప్రదర్శన

మాస్కో పౌరులచే

మాస్కో, జూన్ 20

మాస్కోలోని డేనిష్ ప్రభుత్వ రాయబార కార్యాలయం ఎదుట నేడు మాస్కో పౌరులు ఒక ప్రదర్శన చేశారు. డెన్మార్కు రాజధాని కోపెన్‌హాగన్‌లో ఇటీవల సోవియట్ రాయబార కార్యాలయంపై కొందరు దుండగులు ఇమ్రీ నాగీ ఉరితీతకు అసమ్మతి సూచకంగా దాడి చేసినందుకు నిరసనగానే ఈ ప్రదర్శన జరిగింది.

డెన్మార్కు ప్రభుత్వం దుండగుల చర్యలను అరికట్టాలని, సోవియట్ రాయబారకార్యాలయం శాంతంగా పనిచేసేందు కనువైన పరిస్థితులు నెలకొల్పాలని కోరుతూ ప్రదర్శకులు నినాదాలిచ్చారు. ఆ నినాదాలు వ్రాసిన అట్టలను ప్రదర్శించారు.

ప్రదర్శకులు రాళ్ళు విసిరిన ఫలితంగా డేనిష్ రాయబార కార్యాలయంలోని ఏడు కిటికీల ధ్వంసమైనట్లు తెలుస్తున్నది.

సోవియట్ విదేశాంగ మంత్రి గ్రోమికో కోపెన్‌హాగన్‌లో సోవియట్ రాయబార కార్యాలయంపై జరిగిన దాడికి నిరసన తెలియజేస్తూ డేనిష్ రాయబారికి లేఖ వ్రాశారు.

కేరళలో లక్షమందికిపైగా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాల హెచ్చింపు

1 కోటి 42 లక్షలు వ్యయమయ్యే కొత్త స్కేళ్లు ప్రకటన

తిరువనంతపురం, జూన్ 23

దాదాపు లక్షమంది గెజెటెడ్, నాన్‌గెజెటెడ్ ఉద్యోగులకు 1 కోటి 42 లక్షల రూపాయల మేరకు జీతాలను పెంచుతూ కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం నేడు ప్రకటన చేసింది.

ఇందులో ఎక్కువ భాగం ఎస్.జి.వో. లకు - ముఖ్యంగా మరీ తక్కువ జీతాలుకలవారికి చెందినప్పటికీ వివిధ ప్రభుత్వ శాఖాధిపతుల, గెజెటెడ్ ఉద్యోగుల వేతనాలుకూడా ఇందువలన పెరుగుతాయి.

అతి తక్కువ గ్రేడ్‌లో ఉన్న ప్రభుత్వోద్యోగి జీతం కొత్తస్కేళ్ళ ప్రకారం రు 67/- ఉంటుంది. ఇందులో రు 50/- మూలవేతనం రు 25/- అధికధరల ఎలవెన్సు రు 12 అ ప్రత్యేక అధికధరల ఎలవెన్సుగా ఉంటాయి. మొత్తంమీద ఈ కొత్తస్కేళ్ళ ఫలితంగా రు 10/-చొప్పున ఒక్కొక్కరికి జీతాలు పెరుగుతాయి.

కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వం ఎనిమిది మంది పాల క్రింద ప్రభుత్వోద్యోగుల వేతనాలను పునఃపరిశీలన జేయడానికి మాజీ హైకోర్టుజడ్జి శ్రీ శంకరనారాయణ అయ్యర్ అధ్యక్షతను ఒక కమిటీని వేసింది. ఈకమిటీ తన నివేదికను ఏప్రిల్ 26 వ తేదీన ప్రభుత్వానికి అందజేసింది.

ఈ కొత్తవేతనాల స్కేళ్ళలో రు 30/-లకంటె తక్కువ వేతనం రు 1200/- మించిన వేతనం ఉండదు.

ఈ జీతాల హెచ్చింపులవలన ఇంటి అద్దె ఎలవెన్సు, పార్టీకంగా పనిచేసే ఉద్యోగుల ఎలవెన్సుల హెచ్చింపులవలన, దాదాపు రు 37 లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఖర్చవుతుంది.

పెన్షు రూపాయలకంటె ఎవరికీ హెచ్చుజీతం ఉండరాదన్న విధానాన్ని రెండు సందర్భాల్లోమాత్రమే సడలించారు. హెచ్చుసాంకేతిక నైపుణ్యంగల్గినవారికి హెచ్చు వేతనాలు యివ్వాలన్న సూత్రం దృష్ట్యా చీఫ్ ఇంజనీరును, ఆరోగ్యశాఖ డైరెక్టరుకు వెయ్యిరూపాయలకుమించి వేతనాలు యిచ్చారు. వ్యవసాయం పరిశ్రమలు, మత్స్యపరిశ్రమ, సహకారం మొదలైన శాఖల అధినేతలకు ఇప్పుడుతక్కువజీతాలున్నాయి ఈజీతాలను వారి వారి పరిపాలన నిర్వహణ బాధ్యతలదృష్ట్యా సాంకేతిక విద్యార్హతలదృష్ట్యా పెంచారు.

నేటి ఉదయం ప్రభుత్వం అధికారికంగా చేసిన ఈప్రకటనలో ఇంకా ఈ వివరాలున్నాయి.

"హెచ్చుపు విషయానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత యిచ్చినప్పటికీ వేతనాల కమిటీ సిఫారసులను అందులో క్రిందితరగతికి సంబంధించి సంతవరకు పూర్తిగా అమలు జరిపాలని నిశ్చయించింది పోలీసు కానిస్టేబుల్సు, ఫారెస్టు, ఎక్సైజు గార్డులు, గ్రామోద్యోగులు, లోయర్, అప్పర్ డివిజన్ గుమాస్తాలు ఈ తరగతి క్రిందకు వస్తారు. అతి తక్కువ గ్రేడ్‌లో ఉన్న ప్రభుత్వోద్యోగి స్కేలును ఇప్పుడు రు 30-40 కి మార్చారు. కేంద్ర ప్రభుత్వంలో ఇదే తరగతి ఉద్యోగికి యిచ్చే వేతనం రు 30-½-35 మాత్రమే.

పోలీసులకు హెచ్చు జీతాలు

పోలీసు కానిస్టేబుల్సుకు, హెడ్ కానిస్టేబుల్సుకు ప్రస్తుతం యిస్తున్న కనిష్ట గరిష్ట వేతనాల్లో అయిదు రూపాయలను పెంచారు. ఫారెస్టు, ఎక్సైజ్ గార్డులకు కూడా ఇదే విధంగా పెంచారు

గ్రామోద్యోగులలో తిరువాన్కూర్ కొచ్చిన్ ప్రాంతాల వారికి మాత్రమే ఈ కొత్తస్కేళ్ళు వర్తిస్తాయి. మలబారు ప్రాంతంలో గ్రామ పరిపాలనను పునర్వ్యవస్థీకరించిన తరువాత ఈ స్కేళ్ళు అమలు జరుపుతారు.

ఎన్. జి. వోల యింటిఅద్దె అలవెన్సును పెంచాలని వేతనాల కమిటీ సిఫారసు చేసింది. కాని ప్రస్తుతానికి దీనికి బదులు ప్రభుత్వం ప్రత్యేక అధిక ధరల ఎలవెన్సును రు 7 నుండి రు 12/- లకు పెంచాలని నిర్ణయించింది.

నిర్వ, కైర్యం, భీమా, తదితర శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వోద్యోగులకు కల్గించవలసిన సౌకర్యాల గురించికూడా వేతనాల కమిటీ సిఫారసులను జేసింది. ప్రభుత్వం ఈ సిఫారసులను గురించికూడా త్వరలో చస్తోంది. ఇందులపై త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తుంది.

ఈ వేతనాల హెచ్చింపువల్ల ప్రస్తుతం ఉన్న వ్యత్యాసాలు కొంతవరకు తగ్గిపోవలదని ప్రభుత్వం నమ్ముతోంది. ఒక సర్వమైన ప్రతిపదికపై వేతనాలను స్థిరపర్చడం సాధ్యమైందనీ, ఇవి అన్ని తరగతుల ఉద్యోగులను తృప్తిపరచగలదని విశ్వసిస్తోంది. పరిపాలనా యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించటానికి మార్గాన్ని సుగమం చేయగలదని నమ్ముతోంది. అన్ని తరగతుల ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వంతో అన్ని విధాలా సహకరించాలనీ, తమ బాధ్యతలను జాగ్రత్తగా నిర్వహించాలనీ ఆశిస్తోంది

ఈ కొత్త వేతనాలు 1 వ తేదీ ఏప్రిల్

(మిగతా 4 వ పేజీలో)

సిమెంటు కార్మికుల నిరసన సమ్మె

త్వరలో తేదీ నిర్ణయం

హైద్రాబాద్, జూన్ 23

సిమెంటు పరిశ్రమలోని కార్మికుల వేతనాలు నిర్ణయించే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం నియమించిన వేతన నిర్ణాయక సంఘంలో అఖిల భారత సిమెంటు కార్మికుల సమాఖ్యకు ప్రాతినిధ్యం ఒకరోజుపాటు నిరసన సూచకంగా ఒకరోజు సమ్మె సాగించాలని ఆ సమాఖ్య నిశ్చయించింది.

అఖిలభారత సిమెంటు కార్మికుల సమాఖ్య కార్యదర్శి శ్రీ ఎన్. సత్యనారాయణరెడ్డిగారు ఈ విషయాన్ని నేడిక్కడ పత్రికలవారికి తెల్లడించారు.

దేశంలోగల మొత్తం 25 సిమెంటు కర్మాగారాలలోను, 18 కర్మాగారాలలో పనిచేస్తున్న 21 వేలమంది కార్మికులు అఖిలభారత సిమెంటు కార్మికుల సమాఖ్యలో సభ్యులుగా ఉన్నారు. పోతే, జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షత్వాన ఉన్న సంస్థలో 15 వేలమందిమాత్రమే సభ్యులుగావున్నారు. అయినప్పటికీ వేతన నిర్ణాయక సంఘంలో కేంద్రప్రభుత్వం జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధీన సంఘానికే ప్రాతినిధ్యం ఒసగింది. ఇది చాలా అన్యాయం అని ప్రకటించేందుకు ఒకరోజు నిరసన సమ్మె చేయాలని నిర్ణయించినట్లు ఆయన వివరించారు

అఖిల భారత సిమెంటు కార్మికుల సమాఖ్య కార్యవర్గం జూన్ 25 వ తేదీన సమావేశమై సమ్మె తేదీని నిర్ణయిస్తోందని ఆయన తెలిపారు. (వి. వి.)

లెబనాన్ పరిస్థితిపై 'ఇజ్వెస్తియా' వ్యాఖ్య

మాస్కో, జూన్ 23

అమెరికా, బ్రిటిషు, ఫ్రెంచి సామ్రాజ్యవాదులు పశ్చిమాసియా ప్రాంతంలో తమ లూటీగల్గటం కల్ల అని సోవియట్ ప్రభుత్వపత్రిక 'ఇజ్వెస్తియా' నేడు వ్రాసింది.

లెబనాన్ సంక్షోభంపై వ్యాఖ్యానిస్తూ ఆమెరికా ఇలా తెలిపింది:

పశ్చిమాసియా ప్రాంతంలోని ప్రజలు విదేశీయులు-దల్లాలు చర్యలన్నిటిని పూర్తిగా ప్రతిఘటిస్తారు.

లెబనాన్‌లో అమెరికా జోక్యం!

సిరియా పత్రికల నిశిత విమర్శ

డమాస్కస్, జూన్ 23

లెబనాన్ సమస్యలో అమెరికా పైన జోక్యం తలపెట్టి నిర్వేయించిందని ఇటీవల డల్లెస్ చేసిన ప్రకటనపై సిరియా పత్రికలన్నీ తీవ్రంగా విమర్శించాయి.

ప్రముఖ పత్రిక "అల్ మాల్" యిలా వ్రాసింది:

ఉత్తరపరిధి అమెరికా రాజకీయ వేత్తల ప్రకటనలను, బ్రిటన్, అమెరికాల యుద్ధ సన్నాహాలను గమనిస్తే లెబనాన్‌లో సాయుధ దురాక్రమణను ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదులు ఎంతటి కుట్ర పన్నుతున్నారో విదితమవుతుంది. ఈ దురాక్రమణ కేవలం లెబనాన్ ప్రజలతో ఆగదు; అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ దురాక్రమణ విధానాలను అరబ్ పబ్లిక్‌లో అంతర్భాగమైన సిరియా సరిహద్దుల వరకే కాకుండా మొత్తం మధ్యతరగ పబ్లిక్‌పైకి దురాక్రమణ సలుపుతున్నారు.

ఆంగ్లో - అమెరికన్ దురాక్రమణను ఎదిరించి, మధ్యతరగ పబ్లిక్ స్వాతంత్ర్య, సార్వభౌమాధికారాల పరిరక్షణకు బలంగా దళాలు ఏర్పడాలని ఆ పత్రిక సూచించింది.

అలాగే "అల్ బాఅల్ అమ్", "అల్ సాహెబ్" అనే పత్రికలు కూడా అమెరికన్ రాజకీయ వేత్తల ప్రకటనలనిశితంగా విమర్శించాయి.

డల్లస్ బిరాస ప్రజాభిప్రాయాన్ని, లెబనాన్‌లో అమెరికన్ జోక్యానికి ఉద్బోధిస్తున్నదని "అల్ సాహెబ్" పత్రిక వ్రాసింది. ఇటువంటి చర్యలకు గమక అమెరికన్ సామ్రాజ్యవాదులు కంకణం కట్టుకున్నట్లయితే, అట్లాంటిక్ సముద్రం నుండి పర్షియన్ అఖాతం వరకు - యాతన్నుండి అరబ్ ప్రజల సోదర లెబనాన్ ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల రక్షణకు దీక్షాకంకణబద్ధులవుతారని ఆ పత్రిక హెచ్చరించింది.

విశ్వావసు నామ సంవత్సర
చాంద్రమాన ఆషాఢమాసం
నవమి రా॥ 10 - 45
హస్త మ॥ 2 - 52

విశాలాంధ్ర

బుధవారం 25-6-58
శకమాన ఆషాఢం 4-1880

కౌన్సిల్‌కు నామినేషన్లు

ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు 47 గురిని 22 వ తేదీని ఎన్నుకున్నారు. మరొక 41 మందిని 26 వ తేదీన శాసనసభ్యులు ఎన్నుకుంటారు. పోగా మిగిలిన 12 మందిని గవర్నరు నామినేట్ చేయవలసి ఉన్నది.

సాహిత్యం, శాస్త్రం, కళ, సహకారోద్యమం, సాంఘిక సేవ వంటి రంగాల్లో అనుభవం గాని, ప్రత్యేక విజ్ఞానంగాని కలవారిని గవర్నర్ నామినేట్ చేయవలెనని రాజ్యాంగ చట్టం ఆదేశిస్తున్నది.

ఇటువంటి విషయాల్లో సాంప్రదాయ సిద్ధంగా గవర్నరుకు రాష్ట్ర ప్రభుత్వం సలహాలు స్తూంటుంది. ఆంధ్రప్రభుత్వం ఎవరిని సిఫార్సు చేస్తుందో తెలియదు. ఎవరిని నామినేట్ చేసినా రాజ్యాంగ చట్టం పేర్కొన్న రంగాల్లో దేనికో ఒకదానికి ముడిపెట్టి సమర్థించుకోవచ్చు. అంతమాత్రం చేత ఆయారంగాల్లో ఉన్నంగా అర్హత గలవారికే స్థానం దొరికిందని చెప్పడం సాధ్యంకాదు. ఇటువంటి హక్కులను గవర్నర్లు, ప్రభుత్వాలు దుర్వినియోగం చేసిన అనుభవాలు కూడా మన ముందున్నాయి.

1952 లో మద్రాసు గవర్నరు రాజాజీని లెజిస్లేటివ్ కౌన్సిలుకు నామినేట్ చేశారు. సమర్థించాలంటే ఏ రంగాన్నా ధారంచేసుకున్నా రాజాజీ నామినేషన్ను సమర్థించవచ్చు. కాని అప్పటి సందర్భాన్ని బట్టి అది సక్రమమైనదిగాదు. కాంగ్రెస్ పార్టీ ఆయననుముఖ్యమంత్రిగా చేసేందుకు నామినేట్ చేయించుకున్నది.

సాహిత్య అకాడమీకిగాని, సంగీత నాటక అకాడమీకిగాని అధ్యక్ష కార్యదర్శులను, కార్యవర్గ సభ్యులను ఎన్నిక చేయవలసి వచ్చినపుడు ఆంధ్రప్రభుత్వం ఎన్ని అవకతవకలు చేసిందో, దానిమీద ఎంత వాదోవాదాలు చెలరేగాయో అందరికి గుర్తుండేవుంటుంది. ప్రభుత్వ పక్షపాత వైఖరి ఫలితంగా అర్హులైనవారికి పైఅకాడమీలలో స్థానం లేకుండా పోయిన విషయంగూడా విదితమే

ప్రస్తుతం గ్రంథాలయోద్యమ విశారదుడైన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారిని నామినేట్ చేయవలసిందిగా కోరుతూ ఆ ఉద్యమ కార్యకర్తలు విజ్ఞప్తులు చేస్తున్నారు. అలాంటి సూచనలే వివిధ రంగాలనుండి రావచ్చు.

ఆంధ్రదేశపు కళాకారులను ప్రతిబింబించవలసిన యీ నామినేషన్ల పట్ల ప్రభుత్వం సంకుచితమైన స్వపక్షాభిమానాన్ని అనుసరించడం సవ్యంకాదు. కనుక ఆంధ్ర శాసనసభలో గల అన్నిపార్టీలు ప్రతినిధులతో గవర్నర్ సమావేశం ఏర్పాటు చేయడం ఎంతైనా సముచితం. ఆ సమావేశంలో జరిగే సంప్రదింపుల ననుసరించి 12 మందినీ నామినేట్ చేయడం సముచితం. సాధ్యమైనంతవరకు అర్హులకే కౌన్సిల్లో స్థానం లభించాలంటే ఇదొక్కటే మంచిమార్గం. సుసంప్రదాయం.

తూర్పు ఉత్తర ప్రదేశ్ లో ఆహార పరిస్థితిని పరిశీలించడానికి ప్రణాళికా సంఘం అధ్యక్షులు అయిదుగురు సభ్యులతో ఒక బృందం ఏర్పాటు చేయడానికి నిర్ణయించుకున్నారు.

విశాలాంధ్ర పత్రిక జన్మదినోత్సవం

విజయవాడ, జూన్ 23

విశాలాంధ్ర పత్రిక ఏడవ జన్మదినోత్సవం నిన్న సాయంత్రం విశాలాంధ్ర కార్యాలయంలో జరిగింది.

ఈ సందర్భంలో జరిగిన సభకు విశాలాంధ్ర విజ్ఞానసమితి పాలకవర్గ సభ్యులలో ఒకరైన శ్రీ పొన్నం వీరరాఘవయ్యగారు అధ్యక్షత వహించారు.

విశాలాంధ్ర పత్రిక ప్రధాన సంపాదకులు శ్రీ మోటూరి హనుమంతరావుగారు ప్రసంగిస్తూ పత్రిక లక్ష్యాలను వివరించారు. పత్రికను మరింత అభివృద్ధిజేసి ఆంధ్రప్రజల వాణిగా రూపొందించడానికి సంపాదకవర్గసభ్యులు, మేనేజింగ్ స్టాఫ్ సభ్యులు, ప్రెస్ కార్మికులు - అంతా మరింత దీక్షతో కృషిచేయవలసిన ఆవశ్యకతను ఉద్బోధించారు.

ఆ తరువాత విశాలాంధ్ర కార్యాలయంలోని వివిధశాఖలకు చెందిన వారు పత్రికను అభివృద్ధి చేయడానికి తమ తమ సూచనలను తెలుపుతూ ప్రసంగించారు.

సభానంతరం విశాలాంధ్ర కార్యాలయ సిబ్బందిచే "ఎవరు దొంగ" అనే నాటిక ప్రదర్శించబడింది.

సభకుముందు క్రీడా పోటీలు జరిగింది.

మహాలనోబిస్‌కు సోవియట్ గౌరవం

సోవియట్ శాస్త్ర పరిషత్ సభ్యుడుగా ఎన్నిక

మాస్కో, జూన్ 22

కలకత్తాలోని భారతీయ గణాంక శాస్త్ర సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. సి. మహాలనోబిస్ సోవియట్ యూనియన్ శాస్త్ర పరిషత్ సభ్యుడుగా మరొక ఎన్నుకోబడ్డారు. ఈయనతోపాటు మరొక 31 మంది ప్రముఖ విదేశ శాస్త్రజ్ఞులనుకూడా ఈ పరిషత్ సభ్యులుగా ఎన్నుకొని వారికట్ల సోవియట్ తన గౌరవాన్ని ప్రకటించింది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గసమావేశం

హైదరాబాద్, జూన్ 23

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గ సమావేశం ఈనెల 21 వ తేదీన అకాడమీ అధ్యక్షుడు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతన జరిగింది. అఖిల భారత సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీకృష్ణకృపలానీ ప్రత్యేకాహ్వానంపై ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఇంతవరకూ చేసిన కృషిని శ్రీకృష్ణకృపలానీ మెచ్చుకున్నారు.

"నన్నయ సమకాలీనులు" అన్న గ్రంథం రచన డిసెంబరు మాసానికి పూర్తి అవుతుంది. మాండలిక పదాల సేకరణ కార్యక్రమానికి ఒక పథకం వేశారు. ఈ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభిస్తారు.

హైదరాబాద్‌లో సాంస్కృతిక కేంద్రాన్ని స్థాపించాలన్న ప్రతిపాదనపై సమావేశంలో చర్చలు జరిపారు. సంగీత అకాడమీతోకూడా సమాలోచించినమీదట ఈ విషయంపై తుది నిర్ణయం కోరాలని నిశ్చయించారు.

ఉత్తమ గ్రంథాలకు బహుమతులిచ్చే పథకాన్ని త్వరలో ప్రకటిస్తారు.

అకాడమీ కార్యవర్గ సమావేశం తిరిగి అక్టోబరులో జరగాలని నిర్ణయించారు. (వి. వి)

అమెరికన్ సామ్రాజ్యవాదుల బంటు ఇమ్రీనాగీ

హంగరీ న్యాయ మంత్రిత్వశాఖ వెల్లడించిన వివరాలు

బుడాపెస్ట్, జూన్ 21

విప్లవద్రోహియైన ఇమ్రీ నాగీ, ఆయన ముఠా జరిపిన దేశద్రోహ కుట్రలను గురించి హంగరీ ప్రజాతంత్ర రిపబ్లిక్ న్యాయమంత్రిత్వ శాఖవారు ఈ క్రింది ప్రకటన చేశారు.

హంగరీ మాజీ ప్రధాని ఇమ్రీ నాగీ దేశప్రజల కిచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేక అందుకు విరుద్ధంగా ప్రవర్తించినందుకు న్యాయకర్తవ్యం నుండి, దేశంలోని తదితర బాధ్యతాయుత స్థానాలనుండి ఆయన్ని తొలగించారు.

అయితే, పీటన్నింటికి వెనుకనున్న కుంభకోణం ఏమిటి? అసేది ప్రతివారిని ఎదుర్కొంటున్న ప్రశ్న.

సామ్రాజ్యవాదుల అండ

ఇమ్రీనాగీ, ఆయన ముఠావారు ఒకవైపున దేశంలోని అభివృద్ధి నిరోధక, విప్లవ ప్రతీఘాతకులతో సంబంధాలు పెట్టుకున్నారు. మరోవైపున సామ్రాజ్యవాద ప్రతినిధులతోను, సామ్రాజ్యవాద సంస్థలతోను, తదితర వర్గాలతోను ఈ ముఠావారు విస్తృతమైన సంబంధాలను, సహకారాన్ని ఏర్పర్చుకున్నారు. నాగీ ముఠాలోని కుట్రదారులలో ఒకరైన లాజ్లో కార్డోస్ బుడాపెస్టులోని బ్రిటిష్ కార్యాలయ మాజీ సభ్యుడు కోప్‌తో అనేక సంబంధాలు పెట్టుకున్నాడు ఈ సందర్భంలో, హంగరీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇమ్రీ నాగీ వ్రాసే వ్రాతలన్నింటిని కోప్ పశ్చిమదేశాలకు అందిస్తూవుండేవాడు. అలాగే పాల్ మెలిటరీ అనేవ్యక్తి సాయంతో నాగీ ముఠా బ్రిటిష్ వాళ్ళ సైనికోద్యోగి 'కాలీ'తో సంబంధాలేర్పరచుకున్నాడు. ఈ కాలీయే హంగరీ ఘటనవల్లో ఇమ్రీనాగీకి సైనిక సలహాదారుడుగా కూడ పనిచేశాడు. జెసాలాసోన్జీ అనే మరొకని సహాయంతో పశ్చిమ జర్మన్ సామ్రాజ్యవాదుల ప్రత్యేక ప్రతినిధిగా హంగరీకి పంపబడ్డ లోవెస్ట్రికోతో నాగీ ముఠావారు సంబంధాలేర్పరచుకున్నారు. హంగరీలోని విప్లవ ప్రతీఘాతకులకు పశ్చిమజర్మనీ అండగా వుంటుందని లోవెస్ట్రీనీ కోసత్ రేడియో ప్రసంగంలో హామీ యిచ్చారు.

అమెరికన్ గూఢచారి శాఖతో సంబంధం

సామ్రాజ్యవాద వర్గాలు అమెరికన్ సామ్రాజ్యవాదుల నాయకత్వం క్రింద, హంగరీలో విప్లవ ప్రతీఘాతక పరిపాలనను నెలకొల్పేందుకు అనేకవిధాల ప్రచారాన్ని, గూఢచార కార్యకలాపాలను చాలా కాలంగా కొనసాగిస్తూ వచ్చాయి. ఇందు కనుగుణంగానే సామ్రాజ్యవాదులు ఇమ్రీనాగీముఠాకు "జాతీయ కమ్యూనిజం" అనే నామకరణం చేశారుకూడా! అమెరికా గూఢచారి శాఖకు సంబంధించిన "ఫ్రీడమ్ బర్డ్ యూనివర్సిటీ" అనే పత్రిక హంగరీలో తిరుగుబాటును లేవదీసేందుకు 1956 లో ఒక నిబంధనావళినికూడా ప్రచురించింది. ఈ నిబంధనావళిని హంగరీలో చట్టవ్యతిరేకంగా పంచిపెట్టడం కూడా జరిగింది. ఇక హంగరీలోని కుట్రదారులంతా అమెరికా గూఢచారిశాఖవారి ఈ సలహాలన్నింటినీ పాటించి దేశ విచ్ఛిన్నానికి దారితీయ సంకల్పించారు.

రేసు విచారణ

సామ్రాజ్యవాదులకు బంట్లుగా తయారైన ఇమ్రీ నాగీ, ఆయన అనుచరులు చట్టబద్ధ హంగరీ ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని కూలద్రోయడానికి సన్నద్ధులైనారని, హంగరీ ప్రజాతంత్ర రిపబ్లిక్ ప్రాక్యురేటర్ జనరల్ తన వాఙ్మూలంలో ఆరోపించారు. ఇమ్రీ నాగీ అనుచరులు వీరు: ఫెరంక్ డి నాట్; మిక్లోస్ జిక్సు; జోల్టాన్ టెల్టీ; పాల్ మెలిటర్; సాన్‌డోర్ కోపాక్సీ; జోసెఫ్ సిలాడీ; ఫెరంక్ జానోసీ; మిక్లోస్ వాసరీలు. అంతేగాకుండా ఇమ్రీనాగీ దేశానికి చాలా పెద్దద్రోహం తలపెట్టాడని, అలాగే కోపాక్సీ, పాల్ మెలిటర్‌లు సైనిక తిరుగుబాటును నిర్వహించడంలో ప్రముఖ పాత్ర వహించారని ప్రాక్యురేటర్ జనరల్ తెలియజేశారు.

వెల్లడైన వివరాలు

ఈ విషయమై హంగరీ రిపబ్లిక్ సుప్రీంకోర్టు ఆధీనంలోవున్న పీపుల్స్ కోర్టులో నిందితులనుండి, 29 మందిమంది సాక్షులనుండి తదితరులనుండి వచ్చిన సాక్ష్యాలనుబట్టి ఇమ్రీనాగీ, ఆయన ముఠాపైన హంగరీప్రభుత్వం ఉరిశిక్ష విధించింది.

1955 సంవత్సరాంతంలో ఇమ్రీ నాగీ తన సహచరులనుండే అజ్ఞాత ముఠానొకదాన్ని తయారుచేశాడు. ఏదో విధంగా బలవంతాన అధికారంలోకి రావాలనే తాపత్రయంతో నాగీ ఈ చర్యకు పూనుకొన్నాడని పీపుల్స్‌కోర్టువారు నిర్ధారణచేశారు. అప్పటినుండి ఈ అజ్ఞాత ముఠావారు ఒక వైపున చట్టాన్ని ఉపయోగించుకుంటూ, మరో వైపున చట్ట వ్యతిరేకంగా కూడా అనేక విధాలుగా దేశ విచ్ఛిన్నకర చర్యలకు పూనుకున్నారు.

1955 జనవరిలో ఇమ్రీ నాగీ వ్రాసిన "అంతర్జాతీయ సంబంధాలకు చెందిన అయిదు ప్రాథమిక సూత్రాలు" అన్న గ్రంథంలో, 'మాటాల రద్దు'ను గూర్చి మాట్లాడుతూ, రక్షణ కోసం ఏర్పడ్డ వార్సా సంధిని రద్దుచేసి, దేశాన్ని సామ్రాజ్యవాదులకు కట్టబెట్టడం తన ముఠా లక్ష్యాలలో ఒకటని పేర్కొన్నాడు.

నాగీముఠా సాగించినవిచ్ఛిన్నకర కార్యకలాపాల్లో గాబర్ టాన్‌కోస్, బలాజ్స్ నాగీలుకూడా వున్నారు. వారు హంగరీ గొడవల్లో పశ్చిమ రాజ్యాల్లో తలదాచుకున్నారు. పీరి సాయంతోనే నాగీముఠావారు "పిటాఫీ క్లబ్"ను విచ్ఛిన్నకరశక్తులకు నిలయంగా మార్చివేసి తద్వారా కమ్యూనిస్టుపార్టీపైన, హంగరీ ప్రభుత్వంపైన దాడులకు ప్రధాన సాధనంగా వినియోగించుకున్నారు. ఈ నాగీముఠావారే ప్రజాప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్రేకపూరిత రచనల్ని పత్రికల్లో వ్రాశారు.

సోషలిజానికి విద్రోహం

ఈ వ్యాసాలన్నింటిలోను వారు సోషలిజం నిర్మాణ క్రమంలో జరిగిన పొరపాట్లను గోరంతలు కొండంతలుగా చిత్రించారు. అంతేగాకుండా ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థపైన దురుద్దేశపూర్వకంగా దుష్ప్రచారం సాగించారు.

1958 సెప్టెంబరులో జెసాలాసోన్‌జీ బుడాపెస్టులోని ఇజ్రాయిలీ జర్నలిస్టుతో ప్రత్యేకంగా యిలా చెప్పారు: 'అవసరమైతే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మేము కార్యరంగంలోకి దిగుతాం.'

అంతేగాక; 1955 డిసెంబరులో ఇమ్రీ నాగీ, మాటవరుసకు పార్టీలని పించుకొంటున్న పార్టీలన్నింటిని కలుపుకుని "మిశ్రమ" ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిశ్చయించాడు. అయితే ఈ పార్టీలకున్న తాహతు నెరుగకుండా, రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవర్తించడంవల్ల విప్లవ వ్యతిరేక చర్యలకు దారితీసింది. రాజ్యాంగానికి విరుద్ధంగా దేశంలో వివిధ రకాల పార్టీలు 70 వెలిశాయి. ఇదంతా కొలది రోజుల్లోనే జరిగిపోయింది. వీటిల్లో హంగరీలో లైఫ్ పార్టీ, క్రిస్టియన్ డెమాక్రటిక్ పార్టీ, క్రిస్టియన్ హంగేరియన్ పార్టీ, ది నేషనల్ శ్యాంప్, ది కాథలిక్ పీపుల్స్‌పార్టీల లాంటి బూర్జువా - ఫాసిస్టు పార్టీలు కూడా వున్నాయి అని న్యాయ మంత్రిత్వశాఖవారు తన ప్రకటనలో వివరించారు.

కొత్తగా ఇర్రిగేషన్ మంత్రిగా నియమించబడిన హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీమును రాజ్యసభకు నిలబెట్టడానికి యూ పి. కాంగ్రెసు పార్లమెంటరీబోర్డు నిర్ణయించింది.

బెల్గ్రేడ్‌తో నాగీ ముఠా సంబంధాలు

పెకింగ్ 'పీపుల్స్ డెయిలీ' పత్రిక విమర్శ

టోకియో, జూన్ 23

ఉరితీయబడిన హంగరీ మాజీ ప్రధాని ఇమ్రీ నాగీ యుగోస్లావియాతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకొని విద్రోహాన్ని కొనసాగించారని పెకింగ్ "పీపుల్స్ డెయిలీ" పత్రిక ఆరోపించింది. ఆ పత్రిక సంపాదకీయ వ్యాసంలోని ప్రధానాంశాలు ఇవి:

"యుగోస్లావియా రివిజనిస్టుల మార్గాన్ని అనేక అంతర్జాతీయ, జాతీయ వ్యవహారాలపై నాగీ రివిజనిస్టులు అనుసరించటం మాత్రమేకాక, యుగోస్లావ్ రివిజనిస్టులతో ప్రత్యక్షమైన నిర్మాణ సంబంధాలు కూడా, ఏర్పరచుకొన్నారు.

"విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటు అణచివేయబడిన తర్వాత కూడా, నాగీ ముఠా యుగోస్లావ్ రాయబార కార్యాలయంలో తలదాచుకొంటూ అమెరికా సామ్రాజ్యవాదులతోను, "స్వతంత్ర యూరప్ రేడియో" వారితోను సంబంధాలు కొనసాగించారు.

"బుడాపెస్టులోని యుగోస్లావ్ రాయబార కార్యాలయంవారు నాగీకి అతని ముఠావారికి రక్షణ కల్పించి విప్లవ ప్రతీఘాతుక తిరుగుబాటుకు నాయకత్వం వహించిన "బుడాపెస్టు కేంద్ర కార్మిక సమితి"తో సంబంధాలు పెట్టుకొనేందుకు కూడా వారు ఆ ముఠాకు అనుమతించారు."

హంగరీ విప్లవ ప్రతీఘాతకుల తిరుగుబాటునుంచి కమ్యూనిస్టులు ఈ క్రింది గుణపాఠం స్వీకరించాలని 'పీపుల్స్ డెయిలీ' హెచ్చరించింది.

"రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోటానికి రాజకీయ విప్లవాన్ని పూర్తి చేసిన పిమ్మట, ఏ దేశంలోని కార్మికవర్గం కూడా ఉత్పత్తి సాధనాలను జాతిపరం చేయటంతో సంతృప్తిచెంది మిన్నకుండరాదు. రాజకీయ, సైద్ధాంతిక రంగాలలో కూడా సోషలిస్టు విప్లవాన్ని పూర్తిచేయాలి. తద్వారా విప్లవ ప్రతీఘాతుకానికి కుట్రలుపన్నే రాజకీయ శక్తులను, పెట్టుబడిదారీ శక్తులను, బూర్జువా ప్రభావాలను సమూలంగా నిర్మూలించాలి" అని తెలియజేసింది.

రివిజనిస్టు వ్యతిరేక ప్రచారంపై యుగోస్లావ్ పత్రిక వ్యాఖ్య

బెల్గ్రేడ్, జూన్ 22

ప్రపంచంలోని వివిధ కమ్యూనిస్టు పార్టీలు పెద్దఎత్తున ప్రారంభించిన రివిజనిస్టు వ్యతిరేక ప్రచారం ఒక్క యుగోస్లావియాకు మాత్రమేకాక, మరికొన్ని సోషలిస్టు దేశాలకు వ్యతిరేకంగాకూడా ఉద్దేశితమైనదని యుగోస్లావ్ వార్తాపత్రిక 'బోర్బా' వ్యాఖ్యానించింది.

యుగోస్లావ్ కమ్యూనిస్టు లీగ్ కేంద్ర కమిటీ సభ్యుడు మిటార్ బాకిక్ వ్రాసిన వ్యాసాన్ని ఆ పత్రిక ప్రచురించింది. అందులో ఇంకా ఇలావుంది:

స్టాలిన్ విధానాలకు తిరిగి ప్రాణప్రతిష్ఠ చేయటంలో రివిజనిస్టు వ్యతిరేక ప్రచారం ఒకభాగం మాత్రమే.

యుగోస్లావియాకు వ్యతిరేకంగా సాగించే దుష్ప్రచారానికి యుగోస్లావియాలో నెలకొల్పబడిన సోషలిస్టు వ్యవస్థనే పద్ధాంతికంగాను, రాజకీయంగాను తిరుగులేని జవాబు చెప్పగలదు.

ఒక చిన్న సోషలిస్టు దేశానికి వ్యతిరేకంగా మిగతా సోషలిస్టు దేశాలు నిందాప్రచారం సాగించటం కడు శోచనీయమని ఆ వ్యాసంలో విమర్శించారు.

1948 లో కామిన్‌ఫారం చేసిన తీర్మానాల ఫలితంగా అనేక కమ్యూనిస్టుపార్టీల రాజకీయ, సైద్ధాంతిక కార్యకలాపాలు స్తంభించిపోయినవని, తత్ఫలితంగా యూరపులోని కొన్ని దేశాలలోకమ్యూనిస్టుపార్టీలు అధికారంలోకి రావటానికిగల అవకాశాలకు కూడా విఘాతం కల్గిందనీ ఆ వ్యాసంలో పేర్కొన్నారు.

బిహార్ బోర్డుకమిటీ స్టేట్ బ్యాంకు అధ్యక్షుడు శ్రీ భట్టాచార్యపద్దు సాక్ష్యం తీసుకోవడం పూర్తిజేసింది.

జెక్ కమ్యూనిస్టు మహాసభ విశేషాలు

ప్రాగ్, జూన్ 22

రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం సాగించటం అన్నది కమ్యూనిస్టుపార్టీలు నిర్వర్తించవలసిన అంతర్జాతీయ విధ్యుక్త ధర్మమని జెకోస్లావాకియా కమ్యూనిస్టుపార్టీ మహాసభలో ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు.

జెక్ కమ్యూనిస్టుపార్టీ 11 వ మహాసభ నిన్న సమాప్తమైంది. ఈ మహాసభలో ఆమోదించిన రాజకీయ తీర్మానంలో ఇంకా ఇలా వుంది:

"యుగోస్లావ్ కమ్యూనిస్టు లీగ్ ప్రతినిధుల ప్రచారం చేస్తున్న మార్క్సిస్టు వ్యతిరేక రివిజనిస్టు భావాలను మేము పూర్తిగా తిరస్కరిస్తున్నాం.

"అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంనుంచి యుగోస్లావ్ కమ్యూనిస్టులు తమంతతాముగా వేరైపోతున్నారు.

"ప్రభుత్వ స్థాయిలో సంబంధాలకు సంబంధించినంత వరకు, ఉభయతారకంగా వుండే సంబంధాలను యుగోస్లావియాతో నెలకొల్పుకోటానికి ఇకముందు కూడా మేము కృషిచేస్తాం.

"వైదేశిక నీతికి సంబంధించినంతవరకూ జెకోస్లావేకియా సోవియట్ యూనియన్ శాంతి విధానాన్ని హృదయపూర్వకంగా బలపర్చుతోంది; సోవియట్ యూనియన్‌తో సంబంధాలను మరింత పటుతర మొనర్చుకొనేందుకు పాటుబడుతుంది."

చెకోస్లావాకియా అంతరంగిక వ్యవహారాలలో సామ్రాజ్యవాదుల జోక్యాన్ని తాము సహించేది లేదని ఈ తీర్మానంలో హెచ్చరించారు.

ఆంటోనిన్ నొవొంతి ఎన్నిక

జెకోస్లావాకియా కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శిగా ఆంటోనిన్ నొవొంతి తిరిగి ఎన్నికయ్యారు.

హంగరీప్రభుత్వానికి యుగోస్లావ్ ఆక్షేపణ

బెల్గ్రేడ్, జూన్ 23

ఇమ్రీనాగీ, అతని అనుచరుల ఉరితీతసందర్భంలో హంగరీ న్యాయమంత్రి విడుదలచేసిన ప్రకటనలకు యుగోస్లావియా తన అభ్యంతరం తెలియజేసింది.

హంగరీ ఉపవిదేశాంగ మంత్రి ఇస్త్వాన్ సెచెన్‌కు అందజేసిన ఆక్షేపణ పత్రంలో యుగోస్లావియా ప్రభుత్వం ఇలా పేర్కొన్నది.

హంగరీ న్యాయమంత్రి జారీచేసిన ప్రకటనలో యుగోస్లావియాపై నిరాధారమైనఆరోపణలు అనేకం పొందుపర్చారు. ఇలాంటి నిరాధారమైన నేరారోపణలు ఉభయదేశాల మధ్య సంబంధాలు చెడిపోవటానికి మాత్రమే తోడ్పడతాయి.

ఇమ్రీనాగీ ప్రభృతుల విచారణ, ఉరిశిక్షలకు సంబంధించిన వార్తను విని యుగోస్లావ్ ప్రభుత్వం, ప్రజలు ఎంతో బాధపడ్డారని కూడా ఆ పత్రంలో పేర్కొన్నట్లు యుగోస్లావ్ వార్తాసంస్థ "టాన్యుగ్" తెల్పుతోంది.

ఇమ్రీనాగీ, అతని అనుచరులు బుడాపెస్టులోని యుగోస్లావ్ రాయబార కార్యాలయంలో తలదాచుకొంటూ కూడా, సాయుధ ప్రతిఘటనను కొనసాగించవలసిందని బయటనున్న విప్లవ ప్రతీఘాతుకులకు సలహా లిచ్చారంటూ హంగరీ న్యాయమంత్రి తన ప్రకటనలో చేసిన ఆరోపణ కేవలం అభూతకల్పన అని యుగోస్లావ్ ప్రభుత్వం ఖండించింది.

యుగోస్లావియాపై నిస్సారణంగా, మొదటగా ఈ దాడి ప్రారంభించారనికూడా ఆ అధిక్షేపణపత్రంలో పేర్కొన్నారు.

రష్యా - నేపాల్‌ల సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 23

సోవియట్ - నేపాల్ దేశాల సంయుక్త ప్రకటనపై గతరాత్రి మాస్కోలో సోవియట్ అధ్యక్షుడు నికితా క్రుశ్చేవ్, నేపాల్ రాజు మహేంద్ర చంతకాలు సెట్టినట్లు నేడిక్కడ టాస్ వార్తాసంస్థ తెలుపుతోంది.

రైల్వే కార్మికుల కోర్కెలను నెరవేర్చడం అత్యవసరం

కేరళ ఆర్థికమంత్రి శ్రీ అచ్యుత మీనన్ విజ్ఞప్తి

క్విలన్, జూన్ 23

మన జాతీయ అభివృద్ధి ప్రణాళికలను జయప్రదంగా అమలు జరపడంలో రైల్వే కార్మికుల ప్రముఖమైనపాత్రను నిర్వహించుతున్నారు. అలాంటి వారి న్యాయమైన కోర్కెలను వెంటనే తీర్చవలసిన అవసరం గలదని నే డిక్కడ కేరళ ఆర్థిక మంత్రి శ్రీ సి. అచ్యుత మీనన్ అన్నారు.

సదరన్ రైల్వే లేబర్ యూనియన్ కేంద్ర కార్యవర్గం యిక్కడ సమావేశమై చేసిన తీర్మానాలను వివరించడానికి ఏర్పాటు చేయబడిన బహిరంగసభలో శ్రీ అచ్యుతమీనన్ ప్రసంగించారు.

శ్రీ అచ్యుతమీనన్ తన ప్రసంగంలో ఇటీవల జమ్‌షెడ్‌పూర్‌లోని ఉక్కుకార్మికులు జరిపినసమ్మెపోరాటాన్ని గురించీ, ప్రస్తుతం సాగుతున్న రేవు కార్మికుల సమ్మెను గురించీ ప్రస్తావించారు. దేశ పురోభివృద్ధిని అరికట్టే అలాంటి సమ్మెలురాకుండా చేయడానికి శాశ్వత పరిష్కార మార్గాన్ని వెంటనే కనుగొనడం అవసరమని ఆయన నొక్కి వక్కాణించారు.

అంతకుముందు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. ఆనందన్ నంబియార్, కార్యవర్గ తీర్మానాలను వివరించుతూ ప్రసంగించారు.

సభకు యూనియన్ ఉపాధ్యక్షురాలైన శ్రీమతి పార్వతి కృష్ణన్ (యం. పి.) అధ్యక్షత వహించారు.

ప్రాచ్యభాషా కళాశాల

హైదరాబాద్‌లో ప్రారంభం

హైదరాబాదు, జూన్ 23

హైదరాబాద్‌లో నల్లకుంటలోని వివేకానంద ఎడ్యుకేషన్ సొసైటీ మిషన్ స్కూలు భవనాలలో నేటి సాయంత్రం ఆంధ్ర ప్రాచ్య భాషా కళాశాలకుప్రారంభోత్సవం జరిగింది. ఈ ప్రారంభోత్సవాలకు విద్యామంత్రి శ్రీ పట్టాభిరామారావుగారు అధ్యక్షత వహించారు.

ఆంధ్ర ప్రభుత్వ అభ్యర్థనను మన్నించి కేంద్ర ప్రభుత్వం ఉస్మానియా యూనివర్సిటీని హిందీ యూనివర్సిటీగా మార్చే తలంపును విరమించుకొన్నదనీ, హైదరాబాదులో ప్రత్యేకహిందీయూనివర్సిటీని స్థాపించటంలో ఆంధ్ర ప్రభుత్వం కేంద్రంతో సహకరించగలదనీ శ్రీ పట్టాభిరామారావుగారు తమ ప్రసంగంలో తెలిపారు.

హైదరాబాదులో సంస్కృత నిత్యవిద్యాలయాన్ని స్థాపించటానికి కూడా కేంద్రం సహాయం చేయాలని విద్యామంత్రి విజ్ఞప్తిచేశారు.

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు ప్రాచ్యభాషా పాఠశాలకు ప్రారంభోత్సవం జరిపారు.

ఆంధ్ర రచయితల సంస్థ తరపున ప్రాచ్య భాషా కళాశాలను నిర్వహిస్తారు. ఈ కళాశాలలో ప్రయివేట్ విద్యార్థులకు సాయంత్రంపూట విద్యాబోధన సాగిస్తారు.

ఉస్మానియా యూనివర్సిటీలో అధ్యాపకులుగా పనిచేస్తున్న ప్రొఫెసర్ లక్ష్మీరంజన్, శ్రీరంగాచార్యులుగార్లు కూడా విద్యార్థులకు పాఠాలు బోధించటానికి అంగీకరించారు.

ఉస్మానియా యూనివర్సిటీవారు నిర్వహిస్తున్న ప్రాచ్యభాషా పరీక్షలకు ఈ కళాశాలలో శిక్షణ గరపుతారు.

పద్మవిభూషణ శ్రీ మాడపాటి హనుమంతరావుగారు ఈ కళాశాలకు తన ఆశీర్వచనాలు అందజేశారు.

కేరళ తీరంలో సముద్రపు కోత

ఎర్నాకుళం, జూన్ 23

కొచ్చిన్ ఓడరేవు సమీపంలో వరక్కల్‌నుండి పల్లిపురంవరకూగల తొమ్మిది మైళ్ళదూరం సముద్రం ఇటీవల పడిన భారీవర్షాల మూలంగా కొంత భూభాగాన్ని కోసుకొని పోయింది.

సముద్రం మూడు చోట్ల కోసుకొని పోయింది. తీరంలో వున్న దాదాపు వంద గుడిసెలు తుడిచిపెట్టుకొని పోయాయి. కొలాడి కొట్టుకొచ్చేట్లు పడిపోయాయి.

2,700 సంవత్సరాల నాటి బుద్ధ దేవాలయం

ఉజ్‌బెకిస్తాన్‌లో బయటపడ్డవైనం

తాష్కెంట్, జూన్ 23

బుద్ధ విగ్రహం వున్న క్రీ. పూ. 7 వ శతాబ్దం నాటి ఒక బుద్ధ దేవాలయం ఉజ్‌బెకిస్తాన్‌లో బయటపడింది. ఈ దేవాలయం ఏ మాత్రం చెక్కు చెదరలేదు.

క్రీస్తు వెనుక 8 వ శతాబ్దం మొదట్లో అరబ్ ఖాలీఫాత్ మధ్య ఆసియాను జయించినప్పుడు ఈ దేవాలయం భూస్థాపితం చేయబడిందని, త్రవ్వకాల అనంతరం భారతీయ శాస్త్ర విజ్ఞాన పరిషత్ చరిత్రశాఖ డైరెక్టర్ గుల్యామోవ్ ఒక ప్రకటన చేశారు.

ఉత్తమ కథకు బహుమతి

సికింద్రాబాద్ నవ్యసాహితి సమితి ప్రకటన

హైదరాబాద్, జూన్ 23

సికింద్రాబాద్ నవ్యసాహితి సమితివారు తెలుగులో ఉత్తమ కథకు రు 116 ల బహుమతి యివ్వాలని నిశ్చయించారు. 1958 ఏప్రిల్ 1 నుంచి 1959 మార్చి 31 వ తేదీవరకు ఈక్రింది పత్రికలలో ప్రచురితమైన కథల్లో ఉత్తమమైనదానికి రు 116 ల బహుమతి ఇస్తారు

ఆంధ్రప్రభ వారపత్రిక, ఆదివారం సంచిక; విశాలాంధ్ర ఆదివారం సంచిక; ఆంధ్ర పత్రిక వారపత్రిక, ఆదివారం సంచి

ప్రకటన

నాగార్జున సాగర్ చీఫ్ ఇంజనీర్ వారి ఆఫీసు విజయవాడలో ది 25-6-58 నుండి హిల్ కాలనీ, విజయపురి వార్తలో తెలుపబడును. నాగార్జున సాగర్ కుడికాల్వకు సంబంధించిన ఉత్తరములు ది 25-6-58 తర్వాత కొత్త అడ్రసుకు పంపవలెను.

(సం.) జి. ఏ. నరసింహారావు.
నాగార్జునసాగర్ కాల్వల చీఫ్ ఇంజనీరు.

శులేఖా పెన్ సంతృప్తి నిచ్చును

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
పెన్ మెన్స్ ఇండస్ట్రియల్ సర్వీసెస్,
కాందివ్లి, బొంబాయి-3, యస్. డి లోకల్ సేల్స్:
12, షామ్‌నెట్ వీధి, బొంబాయి

ప్రకటన

నాభార్య ధనమ్మ సుమారు 8 నెలలనుండి కనిపించుటలేదు. బక్కపల్చగా నుండును. చామన ఛాయ. వయసు సుమారు 22, సుమారు 5 సం॥ల వయసుగల కుర్రవాడితో సహా వెళ్ళినది. ఆచూకీ తెలిసినవారు యీ క్రింది అడ్రసుకు తెలుపప్రార్థన.

వీర్ల కృష్ణారావు,
పోరంకి, కృష్ణాజిల్లా.

పేపర్రులో పశువులఆస్పత్రి

తెనాలి తాలూకా పేపర్రు గ్రామంలో శ్రీ గడ్డిపాటి రామయ్య, శ్రీ గడ్డిపాటి వెంకటరత్నయ్య, శ్రీ గడ్డిపాటి క్రిష్ణయ్య, శ్రీ గడ్డిపాటి వెంకటరత్నయ్య, యీ దేవయ్య, యీ నరసయ్య, యీ రత్నయ్య, యీ బుచ్చయ్య, యీ వీరయ్యగార్ల ద్రవ్యసహాయంతో గడ్డిపాటివారి చెర్వులో పశువుల ఆస్పత్రి నిర్మించి, ది 6-6-58 న ఆచార్య గోగినేని రంగారావు చే ప్రారంభించబడి, ఆంధ్ర ప్రభుత్వ వెటర్నరీశాఖ వారికి స్వాధీనము చేయబడినది.

అనుభవజ్ఞులైన ఇంజనీర్లచే చక్కని శిక్షణతో

ఓవర్సీర్ - డ్రాఫ్ట్స్‌మన్

మొదలైన కోర్సులు. S. S. L. C, H. S. C, Matric గాని, (ప్యూపైనా తప్పినా,) కాంపోజిట్ మాథమెటిక్స్ అయినా, కాకపోయినా ఈ కోర్సులు చదువవచ్చును. ఈ కోర్సులలో గవర్నమెంటు పరీక్షలలో ఉత్తీర్ణులైనవారు గవర్నమెంటు ఉద్యోగములుగాని, ప్రైవేటు ఉద్యోగములుగాని పొందగలరు. ఈ కోర్సులు స్త్రీ పురుషులు, వయస్సుతో సంబంధము లేకుండగా, చదువవచ్చును. ప్రాస్పెక్టస్, అడ్మిషన్ ఫారములు ఉచితం.

దుర్గా ఇంజనీరింగ్ కాలేజీ

వ్రజాశంర్లోడ్, గవర్నర్ పేట, విజయవాడ
Principal & Propreitor—
వి. హెచ్. వెంకటేశ్వరరావు.
యల్. యస్. ఇ.

క్వారీ ప్రమాదంలో 9 మంది స్త్రీల మృతి

బొన్నలగడ్డ సమీపంలో దుస్సంఘటన

బొన్నలగడ్డ, జూన్ 22

గుంటూరు తాలూకా బొన్నలగడ్డ గ్రామంవద్ద ముగ్గురాయిలోసం క్వారీ త్రవ్వుతుండగా పైఅంచు విరిగిపడి తొమ్మిదిమంది స్త్రీలు చనిపోయారు.

ఈ గ్రామం నుండి దాదాపు 20 మంది స్త్రీలు ఈనెల 20 వ తేదీ వుదయం గృహోపకరణాల నిమిత్తం ముగ్గురాయి "లాం" క్వారీకి వెళ్లారు. ఇందులో 10 మంది స్త్రీలు ఒక క్వారీలో త్రవ్వుతుండగా అకస్మాత్తుగా పైఅంచువద్దు విరిగి పడ్డందువల్ల కంకరరాయి 9 మంది మీద పడింది. వారు మట్టిక్రిందపడి వూపిరాడక ప్రాణాలు విడిచారు. ఈ చనిపోయినవారికి అతి సమీపంలో వున్న ఒక బాలికకు కూడా ప్రమాదకరమైన దెబ్బలు తగిలాయి. బాలికను గుంటూరు జనరల్ ఆసుపత్రిలో చేర్చారు.

వీరికి కొద్ది గజాల దూరంలో వుండి ముగ్గురాయి ఏరుకుంటున్న మిగతా స్త్రీలు ఈ ప్రమాదస్థితిని చూచి కేకలు వేశారు. సమీపంలో వున్న క్వారీ కార్మికులు, చుట్టుపట్ల వున్న ప్రజానీకం పారలు పట్టారాలు తీసుకొనివెళ్లి కంకరరాయి తోడి, బయటికి తీశారు. 9 మంది లో ఒక్కరుకూడా ప్రాణాలతో బ్రతికి బయటపడలేదు.

చనిపోయిన 9 మంది స్త్రీలు చాలా బీదకుటుంబాలకు చెందిన వారు. ప్రమాదం జరిగిన స్థలానికి లాంపోలీసులు తాడికొండ స్టేషన్ వారు వెళ్ళి శవపంచాయితీ జరిపి, సాయంత్రం 5½ గంటలకు దహన క్రియలకు శవాలను అప్పగించారు.

ప్రమాదంలో చనిపోయినవారి పేర్లు యివి: పుష్పాళ్ళ నారాయణమ్మ, ఇమ్మడి నాగరత్నం (పిరిద్దరు అక్కచెల్లెళ్ళు), ఇమ్మడి చిన్నమ్మాయి, ఇమ్మడి పార్వతిమ్మ (పిరిద్దరు తల్లి, కూతుళ్ళు), నూదా నాగరత్నం, నూదా వెంకాయమ్మ (పిరిద్దరు తల్లి కూతుళ్ళు), ఇమ్మడి సామ్రాజ్యం, దొంతిరెడ్డి కోటమ్మ, ఇమ్మడి సామ్రాజ్యం.

ప్రకటన

నాభార్య ధనమ్మ సుమారు 8 నెలలనుండి కనిపించుటలేదు. బక్కపల్చగా నుండును. చామన ఛాయ. వయసు సుమారు 22, సుమారు 5 సం॥ల వయసుగల కుర్రవాడితో సహా వెళ్ళినది. ఆచూకీ తెలిసినవారు యీ క్రింది అడ్రసుకు తెలుపప్రార్థన.

వీర్ల కృష్ణారావు,
పోరంకి, కృష్ణాజిల్లా.

బజారు ధరలు

విజయవాడ, జూన్ 24

[మధ్యాహ్నం గం॥ 1 తరువు]

బంగారం ధరలు

మేలిమి పాట్లు	రు	108 8 0
నగాసా		107 12 0
నవరసు		78 12 0
కండి 100 తులములు		184 0 0
1 తులము		1 15 0

ధాన్యం ధరలు

24 పెంబరు (కొత్తవి)	రు	28 0 0
వంకసన్నాలు		26 0 0
12 పెంబరు		25 8 0
అక్కర్లు		25 4 0
కుసుమ		24 8 0
కొణామణి		24 8 0

బియ్యం ధరలు

24 పెంబరు (కొత్తవి)	రు.	68 8 0
వంకసన్నాలు		61 0 0
12 పెంబరు		59 0 0
అక్కర్లు		57 0 0
కుసుమ		56 8 0
కొణామణి		56 8 0

అపరాల ధరలు

మినుములు 240 పౌ॥		49 8 0
కందులు	48 0 0	48 0 0
నల్లపెసలు (మాగాణి)	60/-62	0 0
పచ్చపెసలు 280 పౌ॥		68 0 0
పచ్చపెసలు (మెట్టవి)		68 0 0
శనగలు (కేశవాలి)		43 0 0
,, (పంజాబు)		37 0 0
ధనియాలు (26కుంచాలు)		25 8 0
ఉలవలు		41 8 0
ఆముదాలు		48 0 0
పంచదార (ఉయ్యూరు)		104 8 0
కొబ్బరినూనె డబ్బా		38 12 0
నెల్లూరి మణుగు		8 4 0
బెల్లం ,,	8-8-0	5 8 0
మిర్చి ,,	14-0-0	18 0 0
నీరుల్లి		2 2 0
వింతపండు ,,	4-0-0	5 12 0
నువ్వులనూనె ,,		88 0 0
కేసరిసగపప్పు 177 పౌ॥		
జగ్గయ్యపేట		62 4 0
కోదాడు		63 0 0
జూనా మణుగు		16 2 6
,, కేజ్ 160 పౌనులు		20 0 0
కొబ్బరికాయలు 1000		179 0 0
ఉంచులు 100		98 12 0
డిటో ఫార్వర్డు		91 8 0

గుంటూరు జిల్లా గ్రామోద్యోగుల సభ

వినుకొండ, జూన్ 20

గుంటూరుజిల్లా గ్రామోద్యోగీయ సంఘ కార్యవర్గ సమావేశం గుంటూరులో ఈనెల 12 వ తేదీ శ్రీ కట్టా వెంకటనుబ్బారావుగారి అధ్యక్షతను జరిగింది.

ఆంధ్ర ప్రదేశ్ భూసంస్కరణల కమిటీ ప్రశ్నావళికి సమాధానాలు వ్రాసి పంపే విషయమై జిల్లా సంఘ అధ్యక్ష - కార్యదర్శులతో కలసి సంప్రదించడానికై జి. చంద్రమౌళి వరప్రసాదరావు, చింపిరయ్య, పి. ఎస్. ఆర్. ఆంజనేయులుగార్లను ఎన్నుకొన్నారు.

రాష్ట్ర గ్రామోద్యోగీయుసంఘ కార్యవర్గానికి గుంటూరుజిల్లాసంఘం తరపున శ్రీ ఎం. శ్రీహరిరావు (నర్సారావుపేట), శ్రీ జానపాటి తిరుపతిరావు (పల్నాడు) గార్లను ఎన్నుకొన్నారు.

జిల్లాసంఘ ప్రచారశాఖా కార్యదర్శిగా శ్రీ పి. ఎస్. ఆర్. ఆంజనేయులుగారిని (బాపట్ల) ఎన్నుకొన్నారు.

తోటకార్మికుల జీవన స్థితి గతుల్ని గూర్చి బెనీవాలో జరగుతున్న అంతర్జాతీయ కార్మికసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

గుంటూరు హోటల్ కార్మికుల పోరాటం

మద్రాసు సిటీ హోటల్ వర్కర్లసంఘం తోడ్పాటు

మద్రాసు, జూన్ 23

గుంటూరు శ్రీ శంకర్ విలాస్ కార్మికుల పోరాటాన్ని బలపరుస్తూ ఈనెల 15 వ తేదీ మద్రాసు సిటీ హోటల్ వర్కర్సు అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు.

కొత్తవారితో పని చేయిస్తున్న హోటల్ యజమానిచర్యను ఖండిస్తూ ఈ తగాదాలో జోక్యం కల్పించుకోవాలని ఆంధ్రప్రభుత్వాన్ని కోరారు.

గుంటూరు హోటల్ కార్మికుల పోరాటానికి సహాయంగా రు 5-8-0 పంపించారు.

విజయవాడ హోటల్ వర్కర్సు యూనియన్ ప్రకటన

గుంటూరు శ్రీ శంకర్ విలాస్‌లో తొలగించబడిన 30 మంది వర్కర్లను వెంటనే పనిలోకి తీసుకోవాలని యజమానిని కోరుతూ, వర్కర్ల కోర్కెలను బలపరుస్తూ విజయవాడ హోటల్ వర్కర్సు యూనియన్ నేడొక ప్రకటన చేసింది.

కోనసీమ హోటల్ వర్కర్సు యూనియన్-తీర్మానం

శ్రీ కోనసీమ హోటల్ వర్కర్సు యూనియన్ సర్వసభ్య సమావేశం అమలాపురంలో శ్రీ కేతా నాగభూషణంగారి అధ్యక్షతను జరిగింది.

గుంటూరు శ్రీ శంకర్ విలాస్ హోటల్ వర్కర్ల పోరాటాన్ని బలపరుస్తూ తీర్మానించారు.

గుంతకల్లు రైల్వే కార్మికసమ్మె విరమణ

హమాలీల కోర్కెల అమలుకు రైల్వే అధికారి అంగీకారం

గుంతకల్లు, జూన్ 21

గుంతకల్లు రైల్వే ట్రాన్‌షిప్ షెడ్ హమాలీల కోర్కెలను అమలు జరపడానికి రైల్వే అధికారి అంగీకరించినందువల్ల హమాలీలు సమ్మె విరమించి నేటి నుండి పనిలోకి వెళ్లుతున్నారు. ఈ సమ్మెలో 600 మంది పాల్గొన్నారు. ఈనెల 18 వ తేదీన సమ్మె ప్రారంభమైంది.

రైల్వే డివిజనల్ అధికారి శ్రీ చాండీ ఈనెల 16 వ తేదీన రాబోయే సంప్రతింపులను నిరాకరించినందువల్ల పట్టణంలోని కార్మిక సంఘాలు పురప్రముఖులు రైల్వే జనరల్ మేనేజరుకు, రైల్వే మంత్రికి, రైల్వే బోర్డుకు కేంద్ర కార్మిక మంత్రికి, కేంద్ర కన్సీలియేషన్ ఆఫీసరుకు టెలిగ్రాములిచ్చారు.

ఈ సమ్మెకాలంలో ఆనందం గ్రూపు సదరన్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ కార్మిక నాయకులైన శ్రీయుతులు ఉమ్మర్ సాహెబు, జయరాం, శ్రీరామమూర్తిగార్లు దొంగ కూలీలను పంపి కార్మికులలో చీలికలు తీసుకొనిరావడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. వీరు రైల్వే అధికారి దగ్గరకు వెళ్లి రు 1-8-0 లకు ఒక్కకూలీ చొప్పున 800 మందికార్మికులనుకూడా సప్లయి చేయగలనని చెప్పివచ్చినట్లు తెలిసింది. ఈ సంఘ నాయకులు, కార్మికులు తమ వెంటవస్తే పర్మనెంటు చేయిస్తామని, రైల్వే అధికారులు తమ దగ్గరే మాట్లాడతారని కూడా కార్మికుల్లో చెప్పుకున్నారు. సమ్మెదార్లు వీర మాటలను లెక్కచేయలేదు.

సమ్మె సందర్భంలో రైల్వే అధికారులు తమ చేతిక్రింద పనిచేస్తున్న ఎక్స్‌ట్రా క్యాజువల్ లేబర్‌కూలీలను తెచ్చి పనిచేయించారు. కాని ఆపనిని చేయలేకసాయంత్రానికే ఆకార్మికులు వెళ్ళిపోయారు. ఇదిసాధ్యంకాకపోయేటప్పటికి ట్రాన్‌షిప్ మెంటు చేసే సామానులున్న వ్యాగెన్లను లేకి గుంటు, బెంగుళూరుకుపంపేఏర్పాట్లు చేశారు. ట్రాన్‌షిప్ షెడ్డులో పని పూర్తిగా నిలబడిపోయింది.

రాష్ట్ర కమ్యూనిస్టు నాయకులు శ్రీ తరిమెల నాగిరెడ్డిగారు (ఎం. పి.) ఈ సందర్భంలో 20 వ తేదీన రైల్వే అధికారి శ్రీ చాండీని కలుసుకోవడానికి ప్రయత్నించారు. కాని అధికారి మొదట్లో నిరాకరించారు. తరువాత సాయంత్రం 5 గంటలకు శ్రీ నాగిరెడ్డిగారిని కలుసుకొన్నారు. ఈ దిగువ కోర్కెలను వెంటనే అమలు జరపడానికి అంగీకరించారు.

డెయిలీ బత్తెము ఏర్పాటు చేస్తానన్నారు. డెబ్బులు తగిలినప్పుడు కాంపెన్‌సేషన్ యిస్తానన్నారు. టూల్సు సప్లయి చేస్తానన్నారు. కొత్తగా కార్మికులను రిక్రూట్ చేయనన్నారు. వైద్యసౌకర్యం కలిగిస్తానన్నారు. రామమూర్తిని బదిలీ చేసే విషయమై ఆలోచిస్తానన్నారు. పనివిధానంలో మార్పు చేస్తానన్నారు. విక్టిమైజేషన్ చేయనన్నారు. పర్మనెంటు విషయంపై అధికారులచేతిలో వున్నదన్నారు. తన అధికారంక్రిందనున్నవన్ని చేసి పెడతానన్నారు.

రైల్వే అధికారి ఒప్పుకొన్న విషయాలను సమ్మెదార్ల నాయకులకు తెలియజేసి శ్రీ నాగిరెడ్డిగారు ఆనందపురం వెళ్ళిపోయారు.

తరువాత కార్మికులందరూ సమావేశమై సమ్మెను విరమించాలని తీర్మానించారు. తమకు సహాయం చేసిన పుర ప్రముఖులను, సోదర సంఘాలను, శ్రీ తరిమెల నాగిరెడ్డి గారిని అభినందించారు.

కార్మికులు నేటినుండి పనులలోకి వెళ్ళుతున్నారు.



అది సహజమే, తెల్ల శిరోజములు మీ రూపును కళంకపర్చును కాని మీరు నిరాశజెంద నక్కర్లేదు. లక్షలాది జనుల వలె, లోమ వాడి పడుచుదనంగాను సొగసుగాను వుండండి.

లోమ

వెంట్రుకలను సహజంగా నలుపుచేయు జగత్ప్రసిద్ధమైనది.

:- సోల్ ఏజెంట్లు :-
ఎమ్. ఎమ్. ఖంభట్‌వాలా అహమదాబాద్ 1.
ఏజెంట్లు :- పి. నరోత్తమ్ అండ్ కం.,
బొంబాయి 2. Tel : 30575

ఏజంట్లు : విజయ మెడికల్ సిండికేట్,
విజయ వాడ-విజయనగరం

సిద్ధిపేట డిప్యూటీ కలెక్టరు ఆఫీసుముందు రైతులప్రదర్శన

లావుని భూములపై విధించిన పెనాల్టీలు రద్దుపరచాలని నినాదాలు

సిద్ధిపేట, జూన్ 20

లావునీభూములపై విధించిన పెనాల్టీలు రద్దుపరచాలని నినాదాలిస్తూ మెదకుజిల్లా సిద్ధిపేట తాలూకాలో లావునీభూములుసాగుచేస్తున్న హరిజనులు, వెనుకబడ్డ జాతులవారు తదితర బీదరైతాంగం స్త్రీలు, పురుషులు 200 మంది నిన్న డిప్యూటీ కలెక్టరు కార్యాలయంముందు ప్రదర్శన జరిపారు.

వీరు తొమ్మిది పది మైళ్ళ దూరం నుండి నడచివచ్చారు. తాలూకా రైతుసంఘ కార్యాలయం నుండి రైతుసంఘ పతాకాలతో డిప్యూటీ కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళారు. డిప్యూటీకలెక్టర్ లేనందున తాలూకా రైతుసంఘం తరపున శ్రీ అనంతరెడ్డిగారు (కాసర సభ్యులు) విజ్ఞాపన పత్రం పేష్కారుకు సమర్పించారు.

తరువాత గాంధీచౌకువద్ద బహిరంగసభ జరిగింది. తాలూకా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం. సిరాజుద్దీన్ తదితరులు ఉపన్యసించారు.

లావునీ భూములపై విధించిన పెనాల్టీలు రద్దుచేయాలని, ఈ రోజు వరకు బీదరైతాంగం సాగుచేస్తున్న లావునీ భూములు వారి వారిపేర పట్టాలు ఎలాంటి షరతులులేకుండా అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

పాతపట్నంతాలూకాకొమర గ్రామంలో 157 ఇళ్లు దగ్ధం

శ్రీకాకుళం, జూన్ 22

శ్రీకాకుళంజిల్లా పాతపట్నం తాలూకా కొమర గ్రామంలో 157 ఇళ్ళు దగ్ధమయ్యాయి. ఇందులో హరిజనులవి 54 ఇళ్లు. రైతులతాలూకు ధాన్యపుకొట్లు, విత్తనాలతో సహా కాలిపోయాయి.

జిల్లాకమ్యూనిస్టుకమిటీ కార్యదర్శి శ్రీ దారపు గోవిందరాజులు, పాతపట్నం తాలూకా రైతు నాయకులు శ్రీ లోతుగెడ్డ సింహాద్రినాయుడు గార్లు నాయకత్వాన అగ్నిబాధితులు కలెక్టరుబద్దకు రాయబారం వెళ్లారు. పేద హరిజనులకైనా బట్టలు ఇవ్వాలని, ప్రక్కనే వున్న అడవి నుండి కలప తెచ్చుకోడానికి అనుమతి ఇవ్వాలని, అగ్నిబాధితుల కిచ్చే సహాయం తక్షణమే యివ్వాలని కోరారు.

మరునటిదినం కలెక్టరు, ప్లానింగు ఆఫీసరు ఆ గ్రామానికి వెళ్లారు. స్వయంగా పరిశీలించిన తదుపరి వెంటనే సహాయం చేస్తామని వాగ్దానం చేశారు. ప్రక్కనేవున్న ఆగ్రికల్చరు డిమాన్‌స్ట్రేటరును రైతులకు వెంటనే అప్పులు అందించవలసిందిగా కోరారు. హరిజనులకు యిల్లు స్థలాలు చాలా యిరుకుగా వుండుట వలననే యింతనష్టం వచ్చిందని చెప్పగా ఇళ్ళ స్థలాలు గ్రాంటు చేయమని ప్లానింగు ఆఫీసరుకు చెప్పారు.

పంచధార ప్రాజెక్టు మహాసభ సన్నాహం

శ్రీకాకుళం, జూన్ 22

పంచధార ప్రాజెక్టు అఖిలపక్ష ఆహ్వాన సంఘ కార్యదర్శి శ్రీ దారపు గోవిందరాజులుగారు యీ విధంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

పంచధార ప్రాజెక్టు మహాసభ జూలై 6 వ తేదీన ఆమదాలవలసలో జరుపు నిశ్చయించాము. ఈ మహాసభకు కాంగ్రెసు, కమ్యూనిస్టు, సోషలిస్టు నాయకులను యింకా యితర ప్రముఖ నాయకులను ఆహ్వానిస్తాము. ఈ లోగా ప్రాంతీయ సభలను పూర్తిచేయాలి. పంచధార ప్రాజెక్టు మహాసభను జయప్రదం చేయడానికి జిల్లా ప్రజానీకం యావన్మంది తమ సహాయ సహకారాలు అందివ్వ ప్రార్థన.

పాకిస్తాన్‌లో జవుళి కార్మికులపై కాల్పులు

లాహోర్, జూన్ 23

లాల్ పూర్ (లాహోర్) లో సమ్మె చేస్తున్న బట్టలమిల్లు కార్మికులపై పోలీసుల కాల్పులు ప్రారంభించిన ఫలితంగా 5 గురు చనిపోయారు.

సభలు సమావేశాలు

కర్నూలుజిల్లా పంచాయితీ అధ్యక్షుల సంఘ మహాసభ

కర్నూలు, జూన్ 22

కర్నూలుజిల్లా పంచాయితీ అధ్యక్షుల సంఘ ద్వితీయమహాసభ ఈనెల 28, 29 తేదీలలో మహానందిలో జరుగుతుంది. మహాసభ ప్రారంభకులుగా మంత్రి శ్రీ డి. సంజీవయ్యగారు, అధ్యక్షుడుగా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పిడతల రంగారెడ్డి, స్థానిక సంస్థల ఇన్‌స్పెక్టరు శ్రీ జి. సింహాద్రిగార్లు ఆహ్వానింపబడ్డారు.

మహాసభ సందర్భంలో జిల్లాలోని గ్రామ, తాలూకా, జిల్లా పంచాయితీ సంఘాలకు 14 రజితపాత్రలు బహూకరింపబడతాయి.

* * *

నెల్లూరుజిల్లా గూడూరు డివిజన్ కమ్యూనిస్టు కమిటీ సమావేశం గూడూరులో ఈనెల 26 తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతుంది.

* * *

కనిగిరి తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం కనిగిరిలో ఈ నెల 28, 29 తేదీలలో జరుగుతుంది. తాలూకా కమిటీ సభ్యులు 27 వ తేదీ రాత్రికే కనిగిరి చేరుకోవాలి.

* * *

పరంగల్ తాలూకా కమ్యూనిస్టు కమిటీ సమావేశం జూన్ 29, 30 తేదీలలో ఆకెవల్ల గ్రామంలో జరుగుతుంది. సమావేశం 29వ తేదీ ఉదయం 8 గంటలనుండి ప్రారంభమవుతుంది.

ASPLIC-29 TEL

జీవిత బీమా అభివృద్ధి

అనారోగ్యములో లేక ఆరోగ్యములో



ఇదివరకు చాల ఎక్కువమందికి ఆరోగ్యము బాగులేని కారణముగా బీమా చేయుటకు వీలుండేదికాదు. వారిని బాగా ఆరోగ్యవంతులు కారు అనేవారు.

ముఖ్యముగా, బాగా ఆరోగ్యవంతులు కాని వారికే జీవిత బీమా రక్షణ అవసరము ఎక్కువని తెలుస్తోంది. లైఫ్ ఇన్‌స్యూరెన్స్ కార్పొరేషన్ అధికారులు నిరాశపడక చేసిన ముఖ్యమైన పనులలో మొదటిది బాగా ఆరోగ్యవంతులు కాని వారి విషయమై బీమా నియమములను సడలించడమే.

బాగా ఆరోగ్యవంతులు కాని వారికి ఏ సందర్భములలో బీమా యివ్వవచ్చును అన్న విషయమై శాస్త్రోక్తమైన పద్ధతి త్వరలోనే అభివృద్ధి చేయబడినది. లైఫ్ ఇన్‌స్యూరెన్స్ కార్పొరేషన్ నేడు, అంత మాత్ర వ్యాధి ఉన్నవారు, క్షయరోగముండి కోలుకొన్నవారు, మూత్ర పిండములలో ప్రమాదమైన రోగములలో కొన్ని రకములలో బాధపడుతున్నవారు, కొన్ని విధములైన హృదయ రోగములు కలవారు మొదలగు వారికి జీవిత బీమా చేయుటకు అవకాశము యిచ్చేను. వారు ప్రీమియములలో కొంచెము ఎక్కువ తక్కువ కట్టాలి, కాని వారికి బీమా చేసే అవకాశము లేకుండా పోలేదు.

లైఫ్ ఇన్‌స్యూరెన్స్ కార్పొరేషన్ జీవిత బీమా విషయములో విశాల దృక్పథము చూపుతున్నారని పై విషయములు తెలుపుతున్నాయి.

లైఫ్ ఇన్‌స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

అమృతసర్ మహాసభ చెప్పిందేమిటి?

ఏప్రియల్ మాసంలో అమృతసర్‌లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రత్యేక మహాసభ కమ్యూనిస్టుపార్టీ నిర్మాణంలో చారిత్రాత్మకమైన మార్పులు చేసే నిర్ణయాలు చేసింది. ఆ నిర్ణయాలు యేమిటి? ఈ నిర్ణయాలు యెందుకు చేయవలసి వచ్చింది తెలుసుకోవాలంటే చదవండి :

భారత కమ్యూనిస్టుపార్టీపై కేంద్రకమిటీ నివేదిక, అమృతసర్ మహాసభ తీర్మానం

66 పేజీలు : వెల రు. 0-37

ప్రతులకు :
విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-2
పీపుల్సు బుక్ హౌస్, హైద్రాబాద్

సమ్మె కొనసాగించడానికి రేవు కార్మిక సమాఖ్య నిర్ణయం

నెహ్రూతో సంప్రదింపులకు ఢిల్లీకి రాయబార వర్గ పయనం

బొంబాయి, జూన్ 28

నేడు సాయంత్రం ఇక్కడ సమావేశమయిన రేవు కార్మిక సమాఖ్య నాయకులు సమ్మె కొనసాగించాలని నిర్ణయించారు. 4 గంటలపాటు చర్చ జరిపిన అనంతరం కార్మిక నాయకులు ఈ నిర్ణయం చేశారు.

ప్రధాన మంత్రి నెహ్రూనూ, కేంద్ర రవాణా మంత్రి శ్రీ యస్. కె. పాటిల్‌ను కలుసుకొని మాట్లాడాలనికై ఒక రాయబార వర్గాన్ని ఢిల్లీకి పంపించాలనికూడ సమావేశంలో నిర్ణయించారు.

కార్యవర్గం సమావేశమైనతరువాత రేవుకార్మిక సమాఖ్య అధ్యక్షుడు శ్రీ కాలే పై నిర్ణయాలను పత్రికల వారికి తెలియజేశారు.

ఆయన ఇలా అన్నారు:

"ఏమైనా సరే, నెహ్రూతో మేము జరిపే సంప్రదింపుల పర్యవసానం ఏమిటో తేలేవరకు సమ్మె యథాప్రకారం కొనసాగుతుంది."

శ్రీ నెహ్రూను కలుసుకోడానికి కలకత్తా నాయకులు వెళ్లనున్నారు. శ్రీ కాలే (అధ్యక్షుడు), శ్రీ సుఖ్ ఘాటీ (కార్యదర్శి), యస్. ఆర్. కులకర్ణి (అడ్మినిస్ట్రేటింగ్ కార్యదర్శి), శ్రీ సింఘోనీ వీళ్ళు (ఉపాధ్యక్షులు) శ్రీ ఎ. యస్. కె. అయ్యంగార్ (ప్రధాన రేవు కార్మిక నాయకుడు) సమాఖ్య ప్రధాన కార్యదర్శికి నెహ్రూ పంపించిన టెలిగ్రామును సూర్పి ప్రధానంగా కార్యవర్గ సమావేశం చర్చించింది. ఈ టెలిగ్రాంలో నెహ్రూ రేవు కార్మికులు సమ్మెను విరమించుకోవాలని కోరారు. కార్మికుల సహకారం హామీనివ్వాలని ప్రభుత్వం వాంఛిస్తున్నదనీ, అందువల్ల వారికి తెప్పకుండా కార్మికుల కోరికలకే నిర్ణయం ప్రభుత్వానికన్నదని నెహ్రూ ఢిల్లీకి పంపిన తంతిలో వివరించారు. నెహ్రూ పంపిన పై సమాచారాన్ని పత్రికా విలేఖరులకు తెలియజేస్తూ శ్రీ కులకర్ణి ఇలా అన్నారు:

"నెహ్రూ పంపించిన టెలిగ్రామును గురించి కార్యవర్గం చాలా తీవ్రంగా ఆలోచించింది. కాని దీన్ని అధారంగా చేసుకొని సమ్మెను విరమించడం సాధ్యం కాదని నిర్ణయించాము. ఈ సాయంత్రం మళ్ళీ నెహ్రూతో కార్మిక సమాఖ్యతరఫున చర్చలు పంపించాము. తాము పెట్టిన షరతులతో మేము సంపూర్ణంగా ఏకీభవిస్తున్నామని "గౌరవప్రదమైన ఒడంబడిక" "చేసుకోవడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధమేనని ఆయనకు విన్నవించాము. దేశంలోని ఆర్థిక స్థితిగతుల విషయంలో నెహ్రూ వలెనే మేమూ ఆందోళన పడుతున్నామనీ, అయితే కార్మిక సమాఖ్య ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇక్కట్లను కూడ అర్థం చేసుకోవాలని మేము కోరాము. రేవుల్లో ముంచుకుపోయిన ఎక్కువపని చేస్తూ జీతక్రమాన్నైనా కొత్తగా చేకూరుస్తూ పనిచేస్తున్నప్పటికీ కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం మన్నించడంకోసం మా విచారం తెలియచ్చాం." అని అన్నారు.

రేవు కార్మిక సమాఖ్య కార్యవర్గ సమావేశం రహస్యంగా జరిగింది. కార్మిక నాయకులు ఎక్కడ సమావేశమయ్యారో పత్రికలవారికి తెలియనీయలేదు.

కొచ్చిన్ రేవులో మళ్ళీ సమ్మె?

రేవు కార్మికులు సమ్మెపట్ల కేంద్ర రవాణామంత్రి ఇప్పటివలెనే మంకుతనంగా వుంటే, కొచ్చిన్ రేవులో సమ్మెను విరమిస్తూ తాము చేసిన నిర్ణయం కార్మికులు పునరాలోచించకపోతే తప్పుతుందని కొచ్చిన్ రేవు కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీ యం. కె. రాఘవన్ నేడు ప్రకటించారు. "మేము సమ్మెను విరమిస్తే, దీన్ని పునరుద్ధరించుకుని రవాణా మంత్రి రేవు కార్మికుల వివాదాన్ని పారదర్శకంగా పరిష్కరించడానికి పూనుకొంటాడని ఆశించాము. ఆ ఆశతోనే సమ్మెను విరమించుకోవాలని మేము నిర్ణయించాం. కాని శ్రీ పాటిల్ ఊరికే ఉండడమే కాక, దేశక్షేమాన్నుకన్న తనవ్యక్తిగత ప్రతిష్ఠ ముఖ్యమని భావించి మొండికేస్తున్నాడు. ఆయన తిరిగి రాకపోతే, దేశంలోని ఇతర రేవు కార్మికులతోపాటే మేమూ ముప్పుకు దమో తేలడమో జరుగుతుందని హెచ్చరిక చేస్తున్నాను" అనిఅన్నారు.

దురదృష్టకరమైన నిర్ణయమట!

రేవు కార్మిక నాయకుల నిర్ణయాలపై పాటిల్ వ్యాఖ్య

బొంబాయి, జూన్ 28

కేంద్ర రవాణా, కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ యస్. కె. పాటిల్ అఖిల భారత రేవు కార్మికుల సమాఖ్య కార్యవర్గ నిర్ణయాన్ని గురించి పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ "దురదృష్టకరమైన నిర్ణయం" అని వ్యాఖ్యానించారు.

ఆయనింకా ఇలా అన్నారు:

సమాఖ్య నాయకులు ప్రధాన మంత్రిని కలుసుకొని మాట్లాడాలని అనుకోవడంలో తప్పేమీ లేదు. జూలై 17 న తేదీన ఏర్పాటుచేయబడిన సమావేశంలో రేవు కార్మికుల కోర్కెలను గురించి నాను భూతిగా భారత ప్రభుత్వం పరిశీలించదలచిందని చెప్పగలను. సమ్మెవలన కార్మికులకే ఎంతగా నష్టం దాటుకుమో వారు గుర్తించి వుంటారనుకొంటా.

శ్రీ పాటిల్ రేవు ఢిల్లీకి బయలుదేరి వెళుతున్నారు.

రేవు కార్మిక నాయకుల ఢిల్లీ పయనం

న్యూఢిల్లీ, జూన్ 28

రేవు కార్మికుల సమాఖ్య కార్యవర్గం నియమించిన ప్రతినిధి వర్గ సభ్యులు అయిదుగురు నేటిరాత్రి ఇక్కడనుండి విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ప్రతినిధి వర్గంలోని ముగ్గురు సభ్యులైన శ్రీ యస్. ఆర్. కులకర్ణి రేపుదయం విమానంలో బయలుదేరి వెడతారు. అక్కడవారు ప్రధాని నెహ్రూను కలుసుకొని సమ్మె పరిస్థితిని గురించి సంభాషణలు జరుపుతారు.

సమ్మె పరిస్థితి

బొంబాయి, జూన్ 28

పశ్చిమ కోస్తా తీరంలోవున్న కాండ్ల పోడరేవులో యింతకుముందు సమ్మెలో పాల్గొనని 280 మంది కార్మికులు సోమవారంనాడు పనిలోకి రావడం మానివేశారు.

మొత్తం ఆ రేవులో 1600 మంది కార్మికులున్నారు.

కలకత్తా, మద్రాసు, విశాఖపట్టణాలలో సమ్మె యథాతథంగానే కొనసాగుతున్నది.

విశాఖ కార్మికులపై అభాండాలు

కార్మిక సంఘాధ్యక్షుని ఖండన

విశాఖపట్నం, జూన్ 28

సమ్మె చేస్తున్న విశాఖ రేవు కార్మికులు రెండు బోట్లను ముంచివేశారని ప్రకటించబడిన వార్తలు పూర్తిగా నిరాధారమని విశాఖ హార్బరు, రేవు కార్మికుల సంఘాధ్యక్షుడు శ్రీ ఎమ్ వి. భద్రంగారు నేడొక ప్రకటన చేశారు. ఈ పడవలు మునిగి పోయిన ఘటనలో సమ్మెదారుల పాత్ర ఉన్నట్టు వార్తలలో చిత్రించ బడిందనీ, అందుచేత దాని వివరణ చేయవలసి వచ్చిందనీ ఆయన అన్నారు.

ఈ మునిగిపోయిన బోట్లు పెద్దవి సర్వేబోట్లని, ఇవి చాలా జేరికానివి అనడంవలన మామూలు పరిస్థితులలో కూడా తిరగబడుతుంటాయనీ, వుంచుకోవాలని తెలిపారు. చిల్లులద్వారా ఈ బోట్లలోకి నీరు రావడం కద్దనీ, అందుచేత వీటిలో నీటిని పైకి తోడిపోస్తూంటారనీ అన్నారు. ఈ విధంగా లోనికి ప్రవేశించిన నీటిని ఎత్తిపారబోయకపోవడం వలనే ఇవి మునిగిపోయాయన్నారు. సమ్మెచేస్తున్న కార్మికులకు, ఈ సంఘటనకు ఎట్టి సంబంధం లేదన్నారు. కార్మికులపైకి తీనిని నెట్టడం దురుద్ధేశంతో కూడిన ప్రచారం తప్ప వేరుకాదన్నారు. (వి. వి.)

జూన్ 26 న మునిసిపల్ కార్మికుల సమ్మె

హైదరాబాద్, జూన్ 28

కాంట్రాక్టేషన్ 6 రూపాయల కనుగుణంగా చెల్లించవలసిందుకు నిరసనగా హైదరాబాద్ మున్సిపల్ కార్మికులు జూన్ 26 న సమ్మె చేయాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ రేడ్ యూనియన్ కాంగ్రెస్, జాతీయ రేడ్ యూనియన్ కాంగ్రెసు, కింద్ మజ్దూర్ సభ - ఈ మూడు సంస్థల ఆధ్వర్యాన ఉన్న మునిసిపల్ సంఘాల సంయుక్త సమావేశం ఈ నిర్ణయం చేసింది.

పోలీటెక్నిక్ సంస్థ సహాయార్థం లాటరీ

హైదరాబాద్, జూన్ 28

హైదరాబాద్ పోలీటెక్నిక్ విద్యాసంస్థ సహాయార్థం లాటరీ వేయటానికి ఆంధ్రప్రభుత్వం అనుమతించింది. ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రతించిన మీదటనే ఆంధ్రప్రభుత్వం ఇందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది.

ఈ లాటరీ టిక్కెట్లను ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే అమ్మాలని ఆంధ్రప్రభుత్వం ఒకమరకు పెట్టింది.

ఈ లాటరీ వ్యవహారాలను తనిఖీ చేసేందుకు స్పీకరు అయ్యదేవర కాళేశ్వరరావుగారు అధ్యక్షులుగాను, హోంమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారు ఉపాధ్యక్షులుగాను ఒకసంఘాన్ని నియమించారు.

ఈ లాటరీ బహుమతుల విలువ 60 వేలకు మించకుండా వుంటుంది. 1959 ఫిబ్రవరిలో టిక్కెట్లు లాటరీ వేస్తారు.

ఇంపీరియల్ సోడా ఫ్యాక్టరీ ఉద్యోగిబర్తరఫ్

హైదరాబాద్, జూన్ 28

ఇంపీరియల్ సోడా ఫ్యాక్టరీలో ఇరవై సంవత్సరాలకు పైగా పని చేస్తున్న ఒక ఉద్యోగిని యజమానులు అక్రమంగా పనినుంచి తొలగించారు. నికింద్రాబాదు గుమాస్తాల సంఘం అధ్యక్షుడు ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

పనినుంచి అక్రమంగా తొలగించబడిన ఉద్యోగికి రావలసిన బాకీలను, గ్రాట్యుటీని ఇప్పించాలని డిమాండ్ చేశారు.

10 రాష్ట్ర ప్రభుత్వాలచే 47½ కోట్ల రూపాయల రుణ పత్రాలు జారీ

హైదరాబాద్, జూన్ 28

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజల నుండి సేకరించుతున్న 5 కోట్ల ఋణాన్ని సూర్పి నేడు వివరాలు ప్రకటించారు.

ఈ ఋణపత్రాలకు నూటికి 4½ రూపాయలు వడ్డీ ఇస్తారు ఋణపత్రాలను కొనదలచినవారు జూలై 16 నుండి 19 వరకు డబ్బు చెల్లించవచ్చు. నూరు రూపాయల ఋణపత్రానికి 99.5 రూపాయలు చెల్లించాలి.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వలెనే దేశంలో మరిమ్మిది రాష్ట్రాలు కూడా ఇదే మరకులతో ఋణం సేకరిస్తున్నవి.

ఈపది రాష్ట్రాలు కలసి సేకరించన్న ఋణం 47½ కోట్లు. బొంబాయి 10 కోట్లు, ఉత్తరప్రదేశ్ 7 కోట్లు, ఆంధ్రప్రదేశ్, మద్రాసు, మైసూరు, పశ్చిమ బెంగాలు ప్రభుత్వాలు తలా 5 కోట్లు, కేరళ, ఒరిస్సాలు తలా 3 కోట్లు, రాజస్థాన్ 2½ కోట్లు మధ్యప్రదేశ్ 2 కోట్లు సేకరిస్తున్నవి.

కాంగ్రెస్ శాసనసభ పార్టీ సమావేశం

హైదరాబాద్, జూన్ 28

కాంగ్రెస్ శాసనసభ పార్టీ సమావేశం నేడిక్కడ జరిగింది. రెండు గంటలు చర్చించిన అనంతరం శాసనసభ ఎజండాలోవున్న 70 బిల్లులకు అనుమతి యిచ్చింది.

పార్టీ సమావేశం తిరిగి జూన్ 25న జరుగుతుంది. వివిధ కాంగ్రెస్ అభ్యర్థులకు వోట్లు వివిధంగా కేటాయించాలో నిర్ణయిస్తారు. (వి. వి.)

హైవేస్ పనివారల సమస్య

మంత్రివర్గం చర్చించనున్నట్లు వెల్లడి

హైదరాబాద్, జూన్ 28

హైవేస్ పనివారల సంఘం విజ్ఞాపనను మంత్రివర్గం చర్చించనున్నట్లు హైవేస్ కార్మికశాఖ మంత్రి నేడు తెలియజేశారు.

నిన్న హైవేస్, కార్మికశాఖ మంత్రివర్గాలు కార్మిక సంఘాలతరఫున రాయబారం కళ్ళగా విఫలంగా తెలిపారు.

కార్మిక సంఘ రాయబారవర్గం మొదట ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారి వద్దకు వెళ్ళారు. కాని ఆయన రాయబారవర్గాన్ని కలుసుకోనిరాకరించారు. రెండుమూడు రోజుల తర్వాత కలుసుకుంటానని అన్నారు.

బాలురచే పని చేయించరాదనీ, గ్రాట్యుటీ చెల్లించాలనీ, ఇంకా ఇతర కోర్కెలను సంఘం వారు కోరుతున్నారు.

వివిధ రాష్ట్రాల మధ్య సంధాన భాష

హిందీ పాత్రను గురించి ప్ర. సో. పార్టీ అధ్యక్షుని అభిప్రాయం

అహమ్మదాబాద్, జూన్ 28

ప్రజా సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు శ్రీ నరేంద్ర దేవ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఏ భాషనూ ఇతరులపై బలవంతంగా రుద్దరాదన్నారు. అది అందరికీ ఆమోదకరమయ్యేట్లు చూడాలన్నారు. దేశంలో హెచ్చుమంది హిందీని మాట్లాడుతున్నారు గాబట్టి, అది దేశ ఐక్యతకు వినియోగపడగలదనే భావంతోనే హిందీని రాజభాషగా ఆమోదించడమైనదన్నారు.

అయితే "ఇంగ్లీషు స్థానాన్ని హిందీ తీసుకోవాలన్న" ప్రతిపాదనను తాను అంగీకరించలేనని శ్రీ నరేంద్ర స్పష్టంచేశారు. ఇంగ్లీషుకలే హిందీ ప్రాంతీయభాషల స్థానాన్ని ఆక్రమించ రాదన్నారు. వివిధ రాష్ట్రాలమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలకుమాత్రమే హిందీ ఉపయోగపడాలని ఆయన అన్నారు.

హిందీలో టెలిగ్రామ్‌లు పంపడానికి తిరుచురాపల్లి పోస్టాఫీసులో గత పోమవారంనుండి ఏర్పాట్లుజరిగాయి.

తూర్పు పాకిస్తాన్ ప్రభుత్వ పతనం

కరాచీ, జూన్, 28

గడచిన సంక్రవారం తూర్పు పాకిస్తానులో అబుహుస్సేన్ సర్కార్ నాయకత్వాన ఏర్పడిన ప్రభుత్వం నేడు పడిపోయింది. ప్రతిపక్ష ప్రభుత్వానికైతెచ్చిన విశ్వాసరాహిత్య తీర్మానం 14 ఓట్లు తేడాతో నెగ్గింది. తీర్మానానికి అనుకూలంగా 156 మంది ప్రతికూలంగా 142 మంది ఓటు చేశారు.

విశ్వాసరాహిత్య తీర్మానాన్ని అవామీలీగ్ కార్యదర్శి ముజిబుర్ రహమాన్ ప్రతిపాదించారు.

జాతీయ అవామీలీగ్ సభ్యులు 28 మంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు చేశారు.

విశ్వాస రాహిత్య తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం, ఈతీర్మానం నెగ్గితే తన ప్రభుత్వం రాజీనామా చేస్తుందని సర్కారు ప్రకటించారు.

యుద్ధవిరమణ శ్రేణి ఉల్లంఘించి తీరుతాననిఅబ్బాస్

లాహోర్, జూన్ 28

పాకిస్తాన్ ప్రధానమంత్రి చేసిన హెచ్చరికవల్ల, యుద్ధవిరమణ శ్రేణి ఉల్లంఘించి భారత భూభాగంలో ప్రవేశించాలనే తన పట్టుదల ఏమాత్రమూ సడలలేదని చౌదరి గులాం అబ్బాస్ నేడు చెప్పారు.

తాను, తనతోపాటు భారత భూభాగం ప్రవేశించాలని ఉన్న వాలంటీర్లు తమ స్వంత బాధ్యతపైనే ఈపనికి పూనుకొన్నారనీ దీనికి పాకిస్తాన్ ప్రభుత్వానికి ఎలాటి సంబంధం లేదని అందువల్ల పాకిస్తాన్ ప్రధాని చేసిన హెచ్చరిక అసందర్భమయినదనీ అన్నారు.

గులామ్ అబ్బాస్ బెదరింపులు

శ్రీమతి అరుణ హెచ్చరిక

న్యూఢిల్లీ, జూన్ 28

కాశ్మీరు యుద్ధ విరమణ శ్రేణిని దాటడానికి చౌధురి గులామ్‌అబ్బాస్ చేస్తున్న ప్రయత్నం భారతదేశ సర్వస్వాతంత్ర్యాన్ని సవాలు చేయడం తప్ప మరొకటి కాదని ఢిల్లీ మేయర్ శ్రీమతి అరుణ అసఫాలీ అన్నారు.

శ్రీమతి అరుణ అఖిలపక్ష కాశ్మీరు కమిటీ అధ్యక్షురాలుగా పనిచేస్తున్నారు.

ఆమె నేడొక ప్రకటన చేస్తూ భారతదేశానికి సంబంధించిన ఒక ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమణక్రింద వుండటం పూర్తిగా అన్యాయంగా వున్నదన్నారు. కాశ్మీర ఆక్రమిత ప్రాంతాన్నుండి పాక్ సైన్యాలను తరిమి కాశ్మీరు సంపదనీ భారతదేశం క్రిందకు తీసుకోవడం అవసరమని ఆమె అన్నారు.

గులామ్ అబ్బాస్ చేస్తున్న ప్రయత్నాలద్వారా దేశంలోని వివిధ ప్రాంతాల్లోగల కాశ్మీరు కమిటీలు సమావేశమై పాక్ దురాక్రమణను ప్రతిఘటించడానికి తీసుకోవలసిన చర్యలను గురించి నిర్ణయించుకోవాలని శ్రీమతి అరుణ అసఫాలీ విజ్ఞప్తి చేశారు.

నీగ్రో విద్యార్థులపట్ల అస్పృశ్యత: జడ్జీ సమర్థన

లిటిల్‌రాక్, (అర్కన్సాస్), జూన్ 28

అమెరికాలోని లిటిల్‌రాక్ కేంద్ర ఉన్నత పాఠశాలలో నీగ్రో విద్యార్థులు, శ్వేతజాతులకు చెందిన విద్యార్థులు కలిసి కూర్చోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని 1961 వరకు అమలు జరుపకూడదని అమెరికా ఫెడరల్ న్యాయమూర్తి లెమిలే తాను ఇచ్చిన తీర్పువైపే అడ్డు ఇవ్వడానికి నిరాకరించారు. ఈ సమస్యపై అమెరికాలో మళ్ళీ తీవ్ర భిన్నపలు చెలరేగడం ప్రారంభ మయినది.

మైసూరు పట్టణంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని కార్యాలయాలను వుంచుకోవడానికి మైసూరు ప్రభుత్వం మంత్రి శ్రీ కె. సి. రెడ్డి అభ్యర్థనపై అంగీకరించింది.

జర్మనీ ఐక్యం కావాలనేదే రష్యా కోరిక

కృశ్చేవ్ వివరణ

మెల్బోర్న్, జూన్ 28

విభజన జర్మనీ ఏర్పడాలని సోవియట్ యూనియన్ మనసారా కోరుతున్నదని సోవియట్ ప్రధాని నికిటా కృశ్చేవ్ నేడు చెల్లడించారు.

పాశ్చాత్య దేశ ప్రభుత్వాలవలెకాక, సోవియట్ యూనియన్ మొట్టమొదటినుండిజర్మన్ జాతి ఐక్యంగా ఉండాలనివాంఛిస్తున్నారని, దానికై ప్రయత్నిస్తున్నదని అన్నాడు.

మెల్బోర్న్ పత్రిక "హెరాల్డ్" ప్రధాన సంపాదకుడు పంపించిన ప్రశ్నలకు సమాధానాలు పంపుతూ కృశ్చేవ్ పైవిషయం తెలియజేశారు. ఈప్రశ్నలూ సమాధానాలూ హెరాల్డ్ పత్రిక ప్రకటించింది.

కృశ్చేవ్ ఇంకా ఇలా పేర్కొన్నారు:

సోవియట్ యూనియన్ గత 40 ఏండ్లుగా అనుసరిస్తున్న వైదేశిక నీతికి లెనిన్టు కార్య విధానమైన సహజీవన సూత్రమే ప్రాతిపదికగా వుంటున్నది; ఇక ముందుకూడా అదే మా వైదేశికనీతికి మూలకందంగా వుంటుంది.

ఏ శిబిరాగ్ర సమావేశంలోనైనా చేసే నిర్ణయాలు సవరైనా ప్రయోజనాలకు హానికల్గించేవిగా వుండరాదు.

వైనా కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతాలకు, సోవియట్ కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంతాలకు మధ్య వైరుధ్యాలేమీ లేవు. మార్క్సిజం విషయంలోగానీ, సోషలిజానికి విభిన్న మార్గాలు గలవన్న అంశం విషయంలోగానీ కొత్తే వ్యాఖ్యానం ఎవరూ చేయటం లేదు.

అన్ని దేశాలతోను రాజ్య సంబంధాలను పెంపొందించాలని సోవియట్ యూనియన్ వాంఛిస్తున్నది.

పశ్చిమ ఇండియన్ సమస్యపై ఇండోనేషియా వాదనను సోవియట్ యూనియన్ బలపరుస్తున్నదని కృశ్చేవ్ తెలిపారు.

దాల్మియా సంస్థల వ్యవహారాలు

దర్యాప్తుకు శ్రీ దివాన్‌బోస్ నియామకం సంభవం

న్యూఢిల్లీ, జూన్ 28

ముంద్రా కుంభకోణంలో అధికారులపాత్రను గురించి ప్రస్తుతం దర్యాప్తుజరుపుతున్న కమిటీ అధ్యక్షుడైన న్యాయమూర్తి దివాన్‌బోసును దాల్మియా వ్యాపారసంస్థల పరిస్థితులను విచారించడానికి ప్రభుత్వం నియమించిన కమిటీకి అధ్యక్షులుగా నియమించబడవచ్చునని ఇక్కడ తెలుస్తోంది.

శ్రీ బోసు వచ్చేవారంలో హోలెండ్ వెడుతున్నారు. అక్కడనుండి రాగానే దాల్మియా సంస్థల దర్యాప్తు కార్యక్రమానికి పూనుకొంటారని తెలుస్తోంది.

కేంద్ర ఉద్యోగులకు వేతనాల హెచ్చింపు

(1 వ పేజీ తరువాయి)

నుండి అమలులోకి వస్తాయి."

సెక్రటేరియట్‌లో

సెక్రటేరియట్‌లో పని చేస్తున్న అప్పర్ డివిజన్ గుమాస్తాలకు రు 90-180 స్కేలుండేది. ఇప్పుడు ఈ స్కేలు రు 90-230 లకు పెంచబడింది.

ఇతర శాఖల్లో ఉన్నవారికి రు 80-150 నుండి రు 80-180 కు పెంచబడింది.

లోయర్ డివిజన్ గుమాస్తాకు ఇదివరకు వలెనే సెక్రటేరియట్‌లో 50-125 ఇతర శాఖల్లో 40-120 ఇస్తారు.

ఆరోగ్యశాఖ, ఇంజనీరింగ్, పబ్లిక్ వర్క్స్‌శాఖ ఇంజనీయర్లు ఆరోగ్యశాఖ డైరెక్టరు రు 900-1200 స్కేలు పొందుతారు. ప్రస్తుతం వీరికి రు800-1000 ఇవ్వబడుతున్నది."

శ్రీ అచ్యుతమీనన్ వివరణ

ఆర్థికశాఖామంత్రి శ్రీ అచ్యుతమీనన్ ప్రభుత్వ నిర్ణయాలను వివరిస్తూ కనిష్ట గరిష్ట వేతనాలమధ్య అంతరాన్ని నూతన స్కేళ్ళద్వారా తగ్గించగలిగామన్నారు.

వేతనాల కమిటీ సిఫారసులలో ప్రభుత్వం కొలది మార్పులు చేసిందనీ యింటి అద్దె ఎలవెన్సుగురించి కమిటీ చేసిన సిఫారసు కొన్ని చిక్కులతో కూడి ఉండటంవలన దానిస్థానే వందరూపాయల జీతం గల్గినవారికి ప్రత్యేక అధిక ధరల ఎలవెన్సు యివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

మధ్యప్రదేశ్ మంత్రివర్గం

ఒక మంత్రిని రాజీనామా యివ్వమని ముఖ్యమంత్రి డిమాండ్

భోపాల్, జూన్ 28

మధ్యప్రదేశ్ కొండజాతుల సంక్షేమ శాఖామంత్రి రాజా నరేశ్ చంద్రసింగ్‌ను మంత్రివర్గం నుండి రాజీనామా యివ్వవలసిందిగా ముఖ్యమంత్రి డాక్టర్ కైలాసనాథ్ కట్జూ కోరారు.

కాంగ్రెసు అధిష్ఠానవర్గం యిచ్చిన ఆదేశాన్ని అనుసరించే డాక్టర్ కట్జూ ఆయననుండి రాజీనామాను కోరారని తెలుస్తోంది.

గత జనరల్ ఎన్నికల్లో ఇప్పటి ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడైన శ్రీ మహంత్ లక్ష్మీనారాయణదాస్‌కు వ్యతిరేకంగా రాజా నరేశ్‌చంద్రసింగ్ పనిచేశాడని వచ్చిన ఆరోపణలను గురించి దర్యాప్తు జరిపేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఉపసంఘాన్ని మధ్యప్రదేశ్ కాంగ్రెసు కమిటీ నియమించింది.

ఆ ఉపసంఘం నివేదికను ఆధారం చేసుకొని కాంగ్రెసు అధిష్ఠానవర్గం వారు రాజా నరేశ్ చంద్ర సింగ్‌ను రాష్ట్ర మంత్రివర్గంనుండి తొలగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

బీరుట్ కు హామర్ షోల్డ్ తిరుగు ప్రయాణం

కైరో, జూన్ 28

కైరోలో ఐక్య అరబ్ రిపబ్లిక్ అధ్యక్షులు నాజర్, తదితర మంత్రులతో చర్చలు ముగించుకొని విశాల ప్రధాన కార్యదర్శి హామర్‌షోల్డ్ నేడు బీరుట్‌కు తిరుగుప్రయాణమయ్యారు.

లెబనాన్ ఆంతరంగిక కిల్లోలాలను పరిష్కరించే విషయంలో హామర్‌షోల్డ్ మధ్యవర్తిత్వం నెరపుతున్న సంగతి పాఠకులకు విదితమే.

అప్పారావుపేట 54 మైళ్ళదూరంలో వున్న బిజాపూర్ లో మొన్న ఆదివారంనాడు జరిగిన అగ్ని ప్రమాదంలో మూడున్నర లక్షల రూపాయల విలువగల ఆస్తి నష్టమైంది.

అమ్మకం

హెచ్. ఇ. హెచ్. ది నైజాం ప్రైవేట్ ఎస్టేటువారికి మచిలీపట్నం పోర్టుప్రాంతంలో బిల్డింగ్‌తోపాటు వున్న ఒక ఎకరం విస్తీర్ణంగల స్థలము వేలంలో ఎక్కువ మొత్తం పాడిన వారికి, ఏలాంటి ఎక్స్‌కంబరెన్సు లేకుండా అమ్మబడును. ఈ క్రింది వారికి వ్రాయండి.

మీర్ అబ్బాస్ అలీ, ఆస్థాన భార ఇయిమ్, ఇంగుటూరుపేట, మచిలీపట్నం. మరియు హెచ్. ఇ. హెచ్. ది నైజాం ప్రైవేట్ ఎస్టేట్, హైదరాబాదు (ఆంధ్రప్రదేశ్).

ప్రకటన

1956 ఇండియన్ కంపెనీల చట్టం క్రింద మరియు మెస్సర్స్ చెన్నూరు గురుస్వామిచెట్టి & వెంకట్రామయ్య చెట్టి & బ్రదర్స్ (ప్రైవేట్) లిమిటెడ్, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాయొక్క సభ్యుల వలంటరీ వైండింగ్ అప్ విషయంలోను.

పై కంపెనీయొక్క సభ్యుల సాధారణ సమావేశపు తీర్మానంప్రకారం పై కంపెనీ సభ్యుల వలంటరీ లిక్విడేషన్ ప్రొవిజన్ క్రింద, పై కంపెనీని రద్దుచేయడమే అందులకై యీ క్రింది వంతకందారుని 18-6-58 వ తేదీనుండి కంపెనీయొక్క లిక్విడేటర్‌గా నియమించుచూ తీర్మానించడమైనది కంపెనీలో ఆసక్తివున్న వారెవరైనా మరియు కంపెనీనుండి ఎలాంటి పైకమును పొందవలసియున్నవారైనా కంపెనీయొక్క రిజిష్టర్డు ఆఫీసు పనిచేయు వేళలందు వ్యక్తిగతంగా హాజరైగాని యీ క్రిందివారి అడ్రసునకు రిజిష్టర్డు పోస్టుద్వారాగాని యీ ప్రకటన తేదీ లగాయతు 10 రోజులలోగా తమ క్లయిములను తెలియచర్చవచ్చును. పై గడువు తర్వాత వచ్చు క్లయిము లేవైనా తీసుకోబడవు.

సి. నారాయణ, లిక్విడేటర్,
మెస్సర్స్ సి. హెచ్, గురుస్వామిచెట్టి & వేంకట్రామయ్యచెట్టి & బ్రదర్స్ ప్రైవేట్ లిమిటెడ్, (అండర్ లిక్విడేషన్), నెల్లూరు (పోస్టు) శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఆంధ్రప్రదేశ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్

తృతీయ మహాసభ రిపోర్టు తీర్మానాలు

అమ్మకానికి కొద్దిరోజులే వున్నాయి

కావలసినవారు

వెంటనే ఆర్డరు, పోస్టేజి కలిపి 35 న పైసలు

ఫెడరేషన్ ఆఫీసు (విజయవాడ) పంపండి.

అవి అద్భుతమైనవి —
ఎంతో పెకుసైనవి, ఎంతో పుష్టికరమైనవి!

ఎందుచేతనగా, అవి అదునాతన పేస్ట్రీలో ప్రత్యేక పద్ధతులతో తయారు చేయబడినవి. ఆశ్చర్యం కాదు సాకె వారి బిస్కట్లు ఎల్లప్పుడూ రుచించుటకు చాలా మంచివి పెళుసైనవి, రుచియైనవి.



సాకె బిస్కట్లు

సాకె బిస్కట్ అండ్ చాకొలెట్ కో లిమిటెడ్ పూనా-2.

సంపాదకవర్గం: కొమర్రాజు హనుమంతరావు (అధ్యక్షులు); కాళ్లకూడ్డ రాజగోపాలరావు, ఏటుకూరి బలరామమూర్తి - ఎడిటర్, ప్రింటర్, & పబ్లిషర్: విశాలాంధ్ర విద్యాన సమితి తరఫున కాళ్లకూడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్ట్ ప్రింటర్స్, విజయవాడ-3.